www.vishalabharati.com
epaper:vishalabharati.com

గురువారం, హైదరాబాద్
01.02.2024
సంపుటి:2 సంచిక:104

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక



# మధ్యంతర బడ్జెట్ నేడే

- తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్న ఆర్థిక మంత్రి
- ఉదయం 11 గంటలకు లోక్‌సభలో బడ్జెట్ ప్రసంగం
- ఈసారీ డిజిటల్ రూపంలోనే కేంద్రం బడ్జెట్ కాపీ
- ఆరోసారి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలమ్మ
- మొరార్జీ దేశాయ్ తర్వాత సీతారామన్‌ఘనత

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:** యావత్ దేశమంతా ఎంతో ఆసక్తిగా చూస్తున్న కేంద్ర బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టబోతున్నారు. ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ఈసారి మధ్యంతర బడ్జెట్ ఉంటుంది. నిర్మలా సీతారామన్‌కు ఇది ఆరో బడ్జెట్ కాగా, లోక్‌సభ ఎన్నికలు ఉండటంతో నరేంద్ర మోడీ ప్రభుత్వానికి చివరి బడ్జెట్. తాత్కాలిక బడ్జెట్‌లో అన్ని వర్గాలను సంతృప్తి పరిచే నిర్ణయాలు తీసుకుంటారనే అంచనాలున్నాయి. షెడ్యూల్ ప్రకారం, ఉదయం 9 గం.లకు నిర్మలా సీతారామన్ కేంద్ర ఆర్థిక శాఖ కార్యాలయానికి చేరుకుని, అక్కడి నుంచి అధికారులతో కలిసి రాష్ట్రపతి భవన్‌కు వెళ్లనున్నారు. ఉదయం 9.30 గం.లకు రాష్ట్రపతి నుంచి బడ్జెట్

..మిగతా 2 లో



# ఝార్ఖండ్ కొత్త సీఎంగా చంపై సోరెన్!

- హేమంత్ సోరెన్ అరెస్ట్
- అంతకుముందే ముఖ్యమంత్రి పదవికి రిజైన్
- శాసనపక్ష నేతగా చంపై సోరెన్

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:** ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. అంతకుముందే ఆయన తన పదవికి రాజీనామా చేశారు. గవర్నర్ ఆమోదించినట్లు రాజ్‌భవన్ ఓ ప్రకటన విడుదల చేసింది. ఇక కొత్త ముఖ్యమంత్రిగా చంపై సోరెన్ పదవీబాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు ఆయనను జేఎంఎం(ఝార్ఖండ్ ముక్తి మోర్చా) శాసనసభాపక్ష నాయకుడిగా ఎన్నుకున్నారు. రాంచీలో గత కొన్ని రోజులుగా హైడ్రామా నెలకొన్న విషయం తెలిసిందే. సీఎం హేమంత్ సోరెన్ కొంతకాలం పాటూ కనిపించకుండా పోయారు. ఆ తర్వాత ఆయనను ఏ క్షణమైన అరెస్ట్ చేసే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో దాదాపు ఆరు గంటలకు పైగా విచారణ అనంతరం ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం హేమంత్‌ను రాంచీలోని ఈడీ కార్యాలయానికి తరలించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈడీ అరెస్ట్ చేసే అవకాశాలు ఉండటంతో హేమంత్ సోరెన్ సీఎం పదవి నుంచి తప్పుకోనున్నారు. హేమంత్ సోరెన్ ను ఈడీ అరెస్ట్ చేసే భార్య కల్పనా సోరెన్‌కుకు సీఎం పగ్గాలు అప్పగిస్తారని వార్తలు వచ్చాయి. కానీ అనూహ్యంగా కాంగ్రెస్, జేఎంఎం ఎమ్మెల్యేలు చంపై సోరెన్ ను శాసనసభా పక్షనేతగా ఎన్నుకున్నారు.




# వాళ్ల పదవులు ఊడినంకనే.. మీకు ఉద్యోగాలు వచ్చినయ్

- తెలంగాణ ఉద్యమం చేసింది నిరుద్యోగులే..
- కానీ కేసీఆర్ కుటుంబ సభ్యులకే ఉద్యోగాలిచ్చిండు..
- తాము ఉద్యోగాలిస్తుంటే హరీశ్ పిల్లి శాపనార్థాలు
- ఒక్కసారి పేదోళ్ల బిడ్డల కళ్లలో ఆనందం చూడండి
- త్వరలో 15 వేల పోలీస్ జాబ్స్ కు నోటిఫికేషన్
- స్టాఫ్ నర్సుల నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి


**విశాల భారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసేందుకు నిరుద్యోగ యువతీ యువకులే కారణమని, కానీ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులకు ఒరిగిందేం లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎల్బీ స్టేడియంలో నర్సింగ్ ఉద్యోగుల నియామక పత్రాల అందజేత కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కేసీఆర్‌పాలనలో కుటుంబ సభ్యులకు పదవుల గురించి తప్పా.. రాష్ట్రంలో నిరుద్యోగులకు న్యాయం చేయాలనే ఆలోచన చేయలేదన్నారు. వాళ్ల పదవులు ఊడగొట్టినంకనే మీకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. మేం ఉద్యోగాలు భర్తీ చేయడానికి ప్రయత్నిస్తుంటే మా ప్రభుత్వంపై హరీశ్ శాపనార్థాలు పెడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హరీశ్‌రావు పిల్లి శాపనార్థాలకు ఉట్టి తెగిపడదంటూ రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అవాకులు చెవాకులు పేలడం కాదు.. ఒక్కసారి ఇక్కడున్న పేదోళ్ల బిడ్డల కళ్లలో ఆనందం చూడాలని

..మిగతా 2 లో



## నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులు

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- త్వరలో జీవో జారీచేయనున్న ప్రభుత్వం



# రాహుల్ యాత్రపై రాళ్ల దాడి

- కారు అద్దాలు ధ్వంసం .. కాంగ్రెస్ లీడర్ల ఆగ్రహం
- భద్రతా లోపమేనని మండిపాటు

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:** కేంద్రంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వాన్ని గద్దెదించడమే టార్గెట్ గా కాంగ్రెస్ తో పాటు అన్ని అపోసిషన్ పార్టీలు పనిచేస్తున్నాయి. దీనిలో భాగంగా ఇప్పటికే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టి ప్రజల్లో మంచి గ్రాఫ్ సంపాదించారు. అదే విధంగా దీన్ని కంటిన్యూటీగా ప్రస్తుతం రాహుల్ దేశంలో భారత్ జోడో న్యాయ్ యాత్రను కొనసాగిస్తున్నారు. దీనికి ప్రజల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. ప్రస్తుతం రాహుల్ యాత్ర.. వెస్ట్ బెంగాల్ లోకి ప్రవేశించింది. ఇదిలా ఉండగా.. మాల్దా జిల్లాలోని లాభా బ్రిడ్జిపైకి బీహార్ నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించిన భారత్ జోడో న్యాయ్ యాత్రను వీక్షించేందుకు వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. ఈ క్రమంలో కొందరు గుర్తు తెలియని ఆగంతకులు రాహుల్ ప్రయాణిస్తున్న కారుపై రాళ్లదాడి చేశారు. దీంతో కారు అద్దాలు పగిలిపోయాయి. ఈ ఘటన జరిగినప్పుడు రాహుల్ బస్సులో ఉన్నారు. దీంతో కాంగ్రెస్ నేతలు.. తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన పూర్తిగా భద్రతా లోపమని కాంగ్రెస్ నేతలు కేకలు వేశారు. ఇదిలా

..మిగతా 2 లో



# ఆ నోటీసులు కోమటిరెడ్డికే పంపంచండి

- మాణిక్కం ఠాగూర్ పరువునష్టం తాఖీదులపై కేటీఆర్ స్ట్రాంగ్ రియాక్షన్
- పీసీసీ చీఫ్ పదవి కోసం రూ. 50 కోట్లు లంచం ఇచ్చారని చెప్పింది కోమటిరెడ్డేనని కౌంటర్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:** గతంలో రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ అధ్యక్ష పదవి కోసం భారీగా డబ్బులు లంచంగా ఇచ్చారని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలు విపక్షాల కంటే స్వపక్షం నుంచే ఎక్కువగా వచ్చాయి. ఇదిలా ఉంటే తాజాగా పీసీసీ చీఫ్ పదవిని డబ్బులకు అమ్ముకున్నారన్న ఆరోపణలు చేసినందుకు మాణిక్కం ఠాగూర్.. కేటీఆర్ కు పరువు నష్టం నోటీసులు పంపించారు. ఈ నోటీసులపై కేటీఆర్ స్పందించారు. నోటీసులు ఎవరికి పంపాలో తెలియక మాణిక్కం ఠాకూర్ అయోమయంలో ఉన్నారని.. ఈ గందరగోళంతోనే నోటీసులను తప్పుడు అడ్రస్‌కు పంపించినట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. టీపీసీసీ చీఫ్ పదవి కోసం రేవంత్ రెడ్డి నుంచి ముడుపులు తీసుకున్నారని చేసిన ఆరోపణలపై పరువు నష్టం దావా వేశానని.. దీనిపై వారం రోజుల్లోనే సమాధానం ఇవ్వాలని మాణిక్కం ఠాగూర్ ట్విట్టర్ వేదికగా తెలిపారు. ఈ మేరకు కేటీఆర్‌కు పంపిన పరువు నష్టం దావా డాక్యుమెంట్ ను షేర్ చేశారు. దీనిపై స్పందించిన కేటీఆర్.. పీసీసీ ప్రెసిడెంట్ పదవి కోసం రేవంత్ రెడ్డి 50 కోట్లు లంచం ఇచ్చారని మీ పార్టీ నేత కోమటిరెడ్డి వెంకటరెడ్డినే ఆరోపించారని మాణిక్కం ఠాకూర్ దృష్టికి తీసుకెళ్లారు. తాను కేవలం కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై మీడియాలో వచ్చిన వార్తలనే ప్రస్తావించానని తెలిపారు. ఈ ఆరోపణలను కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇప్పటికీ వెనక్కి తీసుకోలేదని.. అలాగని వివరణ కూడా ఇవ్వలేదని అన్నారు. అందుకే పరువు నష్టం దావా నోటీసులను సరైన అడ్రస్‌కు పంపించాలని సూచించారు. తన అడ్రస్‌కు కాకుండా తెలంగాణ సెక్రటేరియట్ లో కూర్చున్న కోమటిరెడ్డి వెంకటరెడ్డికి పంపించాలని అన్నారు.



# కుమారి ఆంటీకి గుడ్ న్యూస్

- అదే ప్లేస్‌లో ఫుడ్ స్టాల్ ఏర్పాటు చేయాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- త్వరలో కుమారీ స్టాల్ కు సీఎం

# కేసీఆర్ హయాంలో పంచాయతీరాజ్ వ్యవస్థ విధ్వంసం



- ఇప్పుడు స్పెషలాఫీసర్లతో పాలనకు కాంగ్రెస్ ప్లాన్
- ఎన్నికలు జరిగే వరకు సర్పంచ్ లను కొనసాగించాలి
- ఇది రాజ్యాంగ విరుద్ధం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

# గౌరెల్లిలో భూబాగోతం!

## అసైన్డ్ భూమిలో ఆశ్రమ నిర్వాహకుల దందా

- యథేచ్ఛగా క్రయ విక్రయాలు, అక్రమ కట్టడాలు
- రూ. కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు హాంఫట్
- అడ్డుకట్ట వేయడంలో రెవెన్యూ ఆఫీసర్లు విఫలం
- ఫిర్యాదు చేస్తే నామమాత్రపు కూల్చివేతలు
- ఆఫీసర్ల 'చేతి'వాటంతో.. కబ్జాదారుల ఇష్టారాజ్యం
- ప్రభుత్వ భూములు కాపాడాలని స్థానికుల డిమాండ్



పేదలకు ప్రభుత్వాలు పంచిన అసైన్డ్‌భూములు అక్రమార్కుల పాలవుతున్నాయి. కొంత మంది రాజకీయ అండదండలతో భూములను కబ్జాలు చేస్తుండగా, మరికొందరు అనాథ ఆశ్రమాల పేరుతో పేద దళితుల భూములను యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారు. అసైన్డ్ భూ లబ్ధిదారుల నుంచి నయానో భయానో భూములను చేజిక్కించుకుంటున్నారు. రెవెన్యూ అధికారుల అండదండలతో వాటికి పట్టాలు, కరెంటు మీటర్లు సృష్టిస్తూ.. పుట్టగొడుగుల్లా అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారు. క్రమంగా వాటిని విక్రయిస్తూ కోట్ల రూపాయలు గడిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇలా ఎకరాలకు ఎకరాలు ప్రభుత్వ భూములను అక్రమార్కులు కాజేస్తుండగా.. అడ్డుకట్ట వేయాల్సిన రెవెన్యూ ఆఫీసర్లు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. స్థానికులు ఫిర్యాదులు చేస్తే నామమాత్రపు కూల్చివేతలతో చేతులు దులుపుకుంటున్నారు. అయితే ఆఫీసర్ల 'చేతి'వాటం, వారి అండదండలతోనే ఈ అక్రమ దందా సాగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



# కుమారి ఆంటీకి గుడ్ న్యూస్

- అదే ప్లేస్‌లో ఫుడ్ స్టాల్ ఏర్పాటు చేయాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- త్వరలో కుమారీ స్టాల్ కు సీఎం

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

కుమారి ఆంటీ.. ఇటీవల సోషల్ మీడియాలో మోత మోగిపోతున్న పేరు. హైదరాబాద్‌లోని కేబుల్ బ్రిడ్జి పరిసరాల్లో స్ట్రీట్ ఫుడ్ వ్యాపారం చేస్తున్న ఆమె సూపర్ ఫేమస్ అయింది. యూట్యూబ్ ఛానెల్స్ ఆమెను బాగా ప్రమోట్ చేశాడు. దీంతో ఫుడ్ లవర్స్ పోటెత్తారు. కేవలం హైదరాబాద్ వాళ్లే కాదు.. ఇతర ప్రాంతాల నుంచి కూడా ఈమె వద్ద ఫుడ్ టేస్ట్ చేసేందుకు వచ్చారు. సెలబ్రిటీలు కూడా కుమారి ఆంటీ ఫుడ్ తినేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో క్రౌడ్ పెరిగిపోయింది. ట్రాఫిక్ సమస్య వాటిల్లింది. దీంతో కుమారి ఆంటీపై పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి.. రోడ్లపై భోజనం అమ్మడానికి వీల్లేదని తేల్చిచెప్పేశారు. మరో ప్రాంతానికి ఫుడ్ స్టాల్ మార్చాలని డిసైడ్ చేశారు. దీంతో ఆమె తన పొట్ట కొడుతున్నారని వాపోయింది. తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది.ఈ విషయం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందించారు. ఆమె అదే ప్రాంతంలో ఫుడ్ స్టాల్ పెట్టుకునేందుకు అనుమతులు జారీ చేయాలని సూచించారు. యధావిధిగా అదే ప్లేసులోనే ఉండి వ్యాపారం చేసుకోవచ్చని తెలిపారు. ప్రజల పాలనలో.. ప్రభుత్వం వ్యాపారస్తులతో ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన ఉంటుందని.. తెలిపారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి కుమారి ఆంటీ ఫుడ్ స్టాల్‌కు వెళ్లి ఫుడ్ ఆస్వాదించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది.

# కేసీఆర్ హయాంలో పంచాయతీరాజ్ వ్యవస్థ విధ్వంసం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

బీఆర్ఎస్, కేసీఆర్ హయాంలో పదేండ్లలో పంచాయతీరాజ్ వ్యవస్థ పూర్తిగా విధ్వంసమైందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. అయితే రాష్ట్రంలో సర్పంచ్ ల పదవీకాలం బుధవారంతో ముగిసిందని, ఎన్నికలు జరిగే వరకు ఇప్పుడున్న వారినే సర్పంచులుగా కొనసాగించాలని కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీలో బుధవారం ఆయన సమక్షంలో పలువురు బీజేపీలో చేరారు. కాగా వారికి పార్టీ కండువా కప్పి కిషన్ రెడ్డి ఆహ్వానించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పంచాయతీలకు కేంద్రం ఇచ్చిన నిధులను దొడ్డిదారిన కేసీఆర్ ప్రభుత్వం దారి మళ్లించిందని ఆయన ఆరోపించారు. గ్రామపంచాయతీలకు ఏరకమైన సహకారం అందించకుండా పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. అయితే ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచ్ ల పదవీకాలం ముగియడంతో స్పెషల్ ఆఫీసర్లతో పాలన సాగించాలని ప్లాన్ చేస్తోందని ఆయన పేర్కొన్నారు. రేవంత్ సర్కారు చేస్తున్న ఈ ప్లాన్ పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని వెల్లడించారు. 73వ రాజ్యాంగ సవరణను కాంగ్రెస్ అవమానిస్తోందని ధ్వజమెత్తారు. సకాలంలో ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని, ఎన్నికలు నిర్వహించేవరకు ఇప్పుడున్న సర్పంచుల పదవీకాలాన్ని పొడగించాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. గ్రామసభలు పెట్టి రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి పదే పదే చెప్పారని, మరి సర్పంచులే లేకపోతే గ్రామసభలు ఎలా నిర్వహిస్తారు? లబ్ధిదారులను ఎలా ఎంపికచేస్తారని ఆయన ప్రశ్నించారు. సర్పంచ్ ఎన్నికలను నిర్వహించకపోవడం వెనుక.. కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలను పక్కనపెట్టే ఆలోచన స్పష్టంగా కనబడుతోందని కేంద్ర మంత్రి విమర్శలు చేశారు. సర్పంచ్ లే లేకపోతే.. లబ్ధిదారుల ఎంపిక జరగదని, అది జరగకపోతే.. పథకాలను అమలుచేయాల్సిన అవసరం ఉండదని వారు భావిస్తున్నారన్నారు. ఇకపోతే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తున్నామని, ఈనెల 2వ తేదీన రాష్ట్రస్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రధాని మోడీ పదేండ్ల పాలన చూసిన తర్వాత తెలంగాణలోని అనేక మంది మేధావులు, సంఘ సంస్కర్తలు, పారిశ్రామికవేత్తలు, మాజీ సైనికులు బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారని ఆయన చెప్పారు. బీజేపీలో చేరిన వారిలో గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకు ఎండీ, మాజీ అమెరికన్ బ్యాంకు ఉద్యోగి సుధాకర్, వ్యాపారవేత్త వినోద్ రావు, నిజామాబాద్ కు చెందిన సైంటిస్ట్ ఎల్లారెడ్డి బీజేపీలో చేరారు.

# మధ్యంతర బడ్జెట్ నేడే

**మొదటిపేజీ తరువాయి**

సమర్పణకు కావాల్సిన అనుమతి తీసుకుంటారు. ఉదయం 10 గం.లకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి, ఆర్థిక శాఖ ముఖ్య అధికారులతో కలిసి పార్లమెంటు వద్దకు చేరుకుంటారు. బడ్జెట్ సమర్పణకు ముందు ఉదయం 10.30గం.లకు పార్లమెంటు ఆవరణలో కేంద్ర కేబినెట్ భేటి జరుగుతుంది. మధ్యంతర బడ్జెట్‌కు ఆమోదం తెలిపిన తర్వాత ఉదయం 11.05 గం.ల నుంచి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోకసభలో బడ్జెట్ ప్రవేశపెడతారు.

**ఈసారి కూడా డిజిటల్ రూపంలోనే బడ్జెట్ కాపీ..**

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌తో పాటు రాష్ట్రపతి పాలనలో ఉన్న జమ్మూకశ్మీర్ వార్షిక పద్దును కూడా ప్రవేశపెడతారు. ఇదే సమయంలో గతేడాది తరహాలోనే ఈసారి కూడా పేపర్‌లెస్ బడ్జెట్‌ను తీసుకురానున్నారు. మేక్ ఇన్ ఇండియా స్ఫూర్తితో తయారుచేసిన ట్యాబ్ ద్వారా ఆర్థిక మంత్రి బడ్జెట్‌ను చదివి వినిపిస్తారు.

**యాప్‌లో బడ్జెట్ వివరాలు..**

ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌కు సంబంధించిన సమాచారం మొత్తం సామాన్యులకు అందుబాటులో ఉంచడానికి ప్రత్యేకంగా 'యూనియన్ బడ్జెట్' అనే యాప్, ప్లాట్‌ఫామ్‌ను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ యాప్, సైట్‌లో పీడీఎఫ్ రూపంలో బడ్జెట్ వివరాలు, ఆర్థిక మంత్రి ప్రసంగం, కేటాయింపులు, ఫైనాన్స్ బిల్లులు, డిమాండ్ ఫర్ గ్రాండ్స్ సహా మొత్తం బడ్జెట్‌కు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లను ఉంచుతారు. 2023లో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను కేంద్రం ప్రధానంగా 'అమృత్ కాల్ 'లో మొదటి బడ్జెట్‌గా పేర్కొంది. ఇది కొత్త ఉద్యోగాల సృష్టి, వృద్ధిని పెంచేందుకు ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడంపై ప్రత్యేక దృష్టి సారించింది. అలాగే, మూలధన వ్యయాన్ని పెంచి, ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రభుత్వ వాటాను ఉపసంహరించుకోవడం లక్ష్యంగా నిర్దేశించింది.

**బడ్జెట్-2024 అంచనాలు..**

ఈ సారి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'దిశనిర్దేశక్ బాతే(దిశనిర్దేశక సంభాషణలు)' పేరున బడ్జెట్‌ను సమర్పిస్తారు. ఇప్పటికే అన్ని వర్గాల నుంచి వినతులు వెల్లువెత్తాయి. ముఖ్యంగా ఎన్నికల ఏడాది కావడంతో ప్రధానంగా మౌలిక సదుపాయాలపై పెట్టుబడులను కొనసాగించడం, మహిళలు, రైతులు, పేదలు, యువత వంటి కీలక రంగాలపై దృష్టి సారించవచ్చని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా దేశం ప్రతిరోజూ పురోగమిస్తూ వృద్ధిలో కొత్త శిఖరాలను అధిగమిస్తూ ముందుకు సాగుతున్న వేళ ఈ రంగాల వారికి ప్రభుత్వం ప్రత్యేక నిర్ణయాలను ప్రకటించాలని భావిస్తున్నారు.

అలాగే, ఎంఎస్ఎంఈకి సంబంధించి నియంత్రణ విధానాలు, రుణాలు, ఆర్థిక సాయం వంటి చర్యలు ఉండాలని కోరుతున్నారు. వేతనజీవులు ఆదాయ పన్ను శ్లాబ్‌లలో సవరణలు, ఆదాయంపై స్టాండర్డ్ డిడక్షన్ (ప్రామాణిక తగ్గింపు) ప్రస్తుతం ఉన్న రూ. 50 వేలను, కొత్త, పాత పన్ను విధానాల్లో రూ.లక్షకు పెంచాలనే డిమాండ్ గట్టిగా ఉంది. అదేవిధంగా సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు రూ. 1.50 లక్షల నుంచి రూ. 3 లక్షలకు పెంచాలని ఆశిస్తున్నారు. మధ్యతరగతి ప్రజలు ఉపాధి అవకాశాలను పెంచే విధానాల కోసం ఎదురుచూస్తున్నారు.

గృహ పథకాలు, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను పెంచే నిర్ణయాలు అవసరమని కోరుతున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కోసం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు మరిన్ని నిధులు కేటాయించడంపై దృష్టి పెట్టాలని, పరిశ్రమలకు సహకారం, ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్యాలతో రీస్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు.

**ఆర్థిక సర్వే లేదు..**

నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం రెండవ దశ చివరి బడ్జెట్‌కు సిద్ధమవుతున్న తరుణంలో, ఈ ఏడాది ఆర్థిక సర్వే ప్రవేశపెట్టలేదు. సాధారణంగా కేంద్ర బడ్జెట్‌కు ఒక రోజు ముందు ప్రధాన ఆర్థిక సలహాదారు సాంప్రదాయకంగా సమర్పించే ఈ ఆర్థిక సర్వే ఈసారి బడ్జెట్ ప్రకటనలతో పాటు లేదు. బుధవారం పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం తర్వాత లోకసభ గురువారానికి వాయిదా పడింది. పార్లమెంటు సంప్రదాయం ప్రకారం, పూర్తిస్థాయి బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం ఆనవాయితీ. అయితే, మధ్యంతర లేదా తాత్కాలిక బడ్జెట్‌కు ముందు ఇది తప్పనిసరి కాదు. ఎన్నికల తర్వాత అధికారం చేపట్టబోయే ప్రభుత్వమే పార్లమెంటులో ఆర్థిక సర్వేను ప్రవేశపెడుతుంది.

# గౌరెల్లిలో భూబాగోతం!



**విశాల భారతి, రంగారెడ్డి బ్యూరో:**

**యథేచ్ఛగా ఆక్రమణలు..**

రంగారెడ్డి జిల్లా.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం .. అబ్దుల్లాపూర్‌మెంట్ మండలంలోని గౌరెల్లి గ్రామ పరిధిలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. గ్రామంలోని అసైన్డ్‌భూములు ఔటర్‌కు పక్కనే కావడంతో వంద గజాల స్థలం సుమారు రూ.20లక్షల నుంచి రూ.కోట్లలో ధర పలుకుతుండడంతో అక్రమార్కుల కన్ను ఈ భూములపై పడింది. కబ్జాకు కాదేదీ అనర్హం అన్నట్లు.. అసైన్డ్ భూములను క్రయ విక్రయాలు చేయొద్దన్న ఆలోచనే మరిచి గద్దల్లా వాలి ఆక్రమణల పర్వం సాగిస్తున్నారు. అధికారుల ఉదాసీనత కారణంగా ఇంకా ఈ గ్రామంలో రూ.కోట్ల విలువైన ఎన్నో భూములు ఆక్రమణదారుల చెరలో చిక్కుకుంటున్నాయి.

**238 సర్వేనంబర్‌లో..**

గౌరెల్లి గ్రామ పరిధిలోని 238 సర్వే నంబర్‌లో సుమారు 84 ఎకరాలకు పైగానే ప్రభుత్వ భూమి ఉంది. అందులో ఆనాటి ప్రభుత్వం భూమి లేని నిరుపేద దళితులకు ఒక్కొక్కరికి 5 ఎకరాల చొప్పున కేటాయించింది. అందులో భాగంగా గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి 5 ఎకరాలు కేటాయించింది. ఆయన అనంతరం సదరు భూమిని బాబయ్య నలుగురు కుమారులు ఒక్కొక్కరు 238/1ఆఅ, 238/1ఆఆ, 238/1ఆఇ, 238/1ఆఈ .. సర్వే నంబర్లలో.. 1.10(ఎకరం పది గుంటల చొప్పున) పంచుకున్నారు. పేదల భూమి కన్నేసిన ఓ అనాథ ఆశ్రమ నిర్వాహకురాలు.. రూల్స్‌కు విరుద్ధంగా.. ఆయన కుమారుల వద్ద నుంచి నయానో భయానో సుమారు 1792 గజాలు(సుమారు 16. 5 గుంటలు) కొనుగోలు చేసింది. దానికి పరస్పర అంగీకార పత్రాలు రాసుకుని క్రయవిక్రయాలు జరిపినట్లు తెలిసింది. సదరు భూమిలో 'యువత ఫౌండేషన్' పేరుతో అనాథ ఆశ్రమం నడుపుతూ క్రమంగా రెవెన్యూ అధికారుల అండదండలతో అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రెగ్యులరైజేషన్‌కోసం సదరు భూమిని '59' కింద దరఖాస్తు చేయగా రిజెక్ట్ అయింది. అయినా సరే ప్లాట్లుగా విభజించి రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ఎలక్ట్రిసిటీ అధికారులను మచ్చిక చేసుకుని వాటికి అసెస్‌మెంట్ (ఇంటి) నెంబరు, కరెంట్ మీటర్లు తెచ్చుకుని అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా నిర్మిస్తోంది. గౌరెల్లిలోని మెజారిటీ అసైన్డ్‌భూములు అన్యాక్రాంతం కావడం, క్రయ విక్రయాలు జరపడం వెనుక ఆర్ఐ తో ఇతర అధికారుల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. రూల్స్ పక్కనపెట్టి ఆ శాఖ అధికారులు 'చేతి'వాటం చూపించడంతో ఆ భూముల కొనుగోళ్లు, అమ్మకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని స్థానికులు చెప్తున్నారు.

**అంతా అధికారుల అండదండలతోనే..**

అక్రమాలు అడ్డుకట్ట వేయడంలో అధికారులు దారుణంగా విఫలమవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కూల్చివేతల్లోనే వారి 'చేతి'వాటం అర్థమవుతుందని రాజకీయ అండదండలు, కోట్ల రూపాయలు చేతులు మారుతుండడంతో కొందరిని చూసీ చూడనట్లు వదిలేస్తున్నారని చెప్తున్నారు. గతంలో కంప్లైంట్ చేయగా.. అక్రమ నిర్మాణాలు ఒకటో, రెండో కూల్చివేసి వెళ్లిపోయారు. అదే సమయంలో కొందరు విక్రయించిన భూములను 'పీవోటీ' లో చేర్చారు. కానీ ఆశ్రమ నిర్వాహకురాలి విషయంలో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇదే 238 సర్వేనంబర్ భాగమైన 238/1ఆ/1/1ఆ/అ సర్వేనంబర్ లోని 5 ఎకరాలు, 238/1ఆ/2 లోని 5 ఎకరాలు.. మొత్తం పది ఎకరాల భూమిని 'పీవోటీ'లో చేర్చి ఆశ్రమ నిర్వాహకురాలి భూములను చేర్చకపోవడంపై అధికారుల చేతివాటమే కారణమని ఆరోపిస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులు స్పందించడం లేదు. అదీ మొక్కుబడిగా హంగామా చేయడం.. ఆ తర్వాత మిన్నకుండిపోతుండడం షరా మామూలైందని స్థానికులు మండిపడుతున్నారు.

## అక్రమాలకు అడ్డుకట్ట పడేదెప్పుడు..?


అసైన్డ్‌భూముల్లో రోజు రోజుకు పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడేదెప్పుడు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. తిలాపాపం.. తలా పిడికెడు అన్న చందంగా అక్రమాలలో అధికారులు కూడా వాటాలు పంచుకుంటున్నారని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో వెంటనే కూల్చివేయాలని డిమాండ్‌చేస్తున్నారు. అక్రమార్కులను ఆదిలోనే కట్టడి చేయాల్సిన అధికారులు ఫిర్యాదులు చేసినా.. దిక్కు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారుల, కలెక్టర్‌గౌరెల్లిలోని సదరు భూములను కాపాడాలని స్థానికులు డిమాండ్‌చేస్తున్నారు. సైన్ బోర్డులు ఏర్పాటు చేసి ఆక్రమణకు గురి కాకుండా చూడాలని కోరుతున్నారు.

## చర్యలు తీసుకుంటాం

గౌరెల్లి గ్రామ పరిధిలో జరుగుతున్న అక్రమాలు కొన్ని మా దృష్టికి వచ్చాయి. అందులో అసైన్డ్ భూముల కొనుగోలు వ్యవహారం కూడా ఉంది. కానీ రెవెన్యూ సిబ్బంది కొరతతో చర్యలు తీసుకోవడం ఆలస్యమవుతోంది. త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

– రవీంద్ర దత్, తహసీల్దార్, అబ్దుల్లాపూర్ మెట్



# వాళ్ల పదవులు ఊడినంకనే.. మీకు ఉద్యోగాలు వచ్చినయ్

**మొదటిపేజీ తరువాయి**

హితవు పలికారు. 'కేసీఆర్.. మీరైనా పిలిచి మీ అల్లుడికి గడ్డి పెట్టండి' రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా.. 'మా ప్రభుత్వం టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేసి కొత్త ఛైర్మన్, సభ్యులను నియమించింది. త్వరలోనే ఉద్యోగాల భర్తీ చేపడతాం.. ఈ వేదిక నుంచి మీకు మాట ఇస్తున్నా నిరుద్యోగులకు ఇచ్చిన మాటకు మేం కట్టుబడి ఉన్నాం.. ఏడాదిలోగా 2లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తాం.. మీ కండ్లలో ఆనందం చూసి..ఫామ్ హౌస్ లో ఉన్నోళ్లు కుల్లుకున్నా.. కడుపులో దుఃఖం పొంగుకొచ్చినా ఉద్యోగాల భర్తీ ఆగదు.. ' అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. త్వరలో 15 వేల పోలీస్‌ఉద్యోగాలకు నోటిఫికేషన్‌ఇస్తామని సీఎం చెప్పారు. ఎల్బీ స్టేడియంలో ఈ కార్యక్రమంలో శాసన సభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు దామోదర రాజనర్సింహా, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేం నరేందర్ రెడ్డి, హర్కర వేణుగోపాల్ రావు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.


## వైద్య ఆరోగ్య శాఖలో మరో 5 వేల ఉద్యోగాలు ..

'వైద్య ఆరోగ్య శాఖలో మరో 5 వేల ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రయత్నిస్తున్నాం' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని అన్నారు. ఒకేసారి 7,094 మంది స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు అందించినట్లు తెలిపారు. ప్రత్యేక తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని యువత ఆశించారని అన్నారు. గొప్ప ఆశయంతో తెలంగాణ కోసం యువత పోరాటం చేసిందని గుర్తు చేశారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఇచ్చిందని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత కోరుకున్నట్లే నేడు ఉద్యోగాలు వస్తున్నాయి అని పేర్కొన్నారు.

– డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

# నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులు

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. గద్దర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా రవీంద్ర భారతీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులు అందజేస్తామన్నారు. సమాజాన్ని చైతన్యం చేసేందుకు గజ్జె కట్టి గళం విప్పిన గొప్ప వ్యక్తి అంటూ గద్దరు కీర్తించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలని ఉద్యమం మొదలు పెట్టిన వ్యక్తి గద్దరన్న అని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. త్యాగాల పునాదులపై ఏర్పడిన రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరడం లేదని మళ్లీ ఉద్యమం మొదలు పెట్టింది గద్దరన్నే అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడాలన్న గద్దరన్న మాటలు మాకు స్ఫూర్తి అని తెలిపారు సీఎం రేవంత్. వచ్చే ఏడాది నుంచి గద్దర్‌ప్రతీ జయంతి రోజున ఈ పురస్కారాలను ప్రదానం చేస్తామన్నారు. ఇటీవల సినీ పరిశ్రమకు సంబంధించిన ప్రముఖులు సీఎంని కలిసినప్పుడు నంది అవార్డులను పునరుద్ధరించాలని కోరారు. అయితే నంది అవార్డులు కాదు గద్దర్ పేరిట అవార్డులు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఆ నిర్ణయాన్ని ఇప్పుడు గద్దర్ జయంతి ఉత్సవాల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వివిధ భాషల్లో పరిజ్ఞానం ఉన్న వారికి గద్దర్ అవార్డును అంద జేస్తామన్నారు. కవులు, కళాకారులకు ఇవ్వడం ద్వారా.. గద్దర్‌ను స్మరించుకోవాలనే ఆలోచనతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. తెలంగాణ లెజెండ్, తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్ పేరుమీద ఎవరికి అవార్డు వచ్చినా అదో గొప్ప అవకాశంగా భావించాలన్నారు సీఎం రేవంత్ రెడ్డి. నా మాటే శాసనం.. నా మాటే జీవో అంటూ రేవంత్‌రెడ్డి ఈ ప్రకటన చేశారు. ఈ నిర్ణయానికి సంబంధించి త్వరలోనే జీవో విడుదల చేస్తామని చెప్పారు. సీఎం రేవంత్ నిర్ణయానికి ప్రజా యుద్ధనౌక అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఇది ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం అని, ఐదేళ్లు సుస్థిర పాలన అందిస్తామన్నారు. ఇదిలా ఉంటే ఇప్పటికే గద్దర్‌కు అరుదైన గౌరవం ఇస్తూ ఆయన విగ్రహం ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు. కవితా కలానికి, గళానికి స్మారకంగా గద్దరన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించి.. కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.



# ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేసిన.. బల్మూరి వెంకట్, మహేశ్ కుమార్ గౌడ్

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

కాంగ్రెస్ నుంచి నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, మహేష్ కుమార్ గౌడ్ లు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. మధ్యాహ్నం 3.30 గంటలకు శాసన మండలి చైర్మన్ ఛాంబర్‌లో ఇద్దరు నేతలు ఎమ్మెల్సీ లుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులఎమ్మెల్యేలు హాజరయ్యారు. అయితే.. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ప్రమాణస్వీకారం ఉత్సవానికి హాజరైన ముఖ్య అతిథులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీగా తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి తో పాటు రాష్ట్రంలోని అన్ని విభాగాల నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సాధారణ ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడు నుండి రాష్ట్ర అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీలో పని చేసిన నా సేవలను గుర్తించారన్నారు బల్మూరి వెంకట్. తన నియామకం పట్ల ఏఐసీసీ, టీపీసీసీ నాయకత్వానికి, శాసనసభ్యులకు, మండలి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం మాపై ఉంచిన బాధ్యతను ప్రజల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం చేసే విధంగా ముందుకు సాగుతామన్నారు బల్మూరి వెంకట్.అనంతరం బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ ఇంచార్జీ దీపా దాసు మున్షి, ఏఐసీసీ, టీపీసీసీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీగా యువతకు అవకాశం కల్పించడం పట్ల రాష్ట్రంలో యువతకు రాజకీయాల్లోకి ప్రోత్సాహం పెరుగుతుందన్నారు మహేష్ కుమార్ గౌడ్. శాసన మండలి అనేది పెద్దల సభ అలాంటి పెద్దల సభలో మాకు అవకాశం కల్పించడం రాహుల్ గాంధీ తీసుకున్న గొప్ప నిర్ణయం తీసుకున్నారని ఆయన అన్నారు. తమకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. రాష్ట్రంలో మా ప్రభుత్వం ఉన్నందున అన్ని సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తామన్నారు.

# రాహుల్ యాత్రపై రాళ్ల దాడి

**మొదటిపేజీ తరువాయి**

ఉండగా.. '' ఈరోజు మాల్దాలో సీఎం మమతా బెనర్జీ ర్యాలీలో పోలీసులందరూ బిజీగా ఉన్నారని తెలిపారు. అందుకే రాహుల్ కు తక్కువ మంది పోలీసు అధికారులను నియమించారని ఒక సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు అఖిలేష్ సింగ్ పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌదరికి జెండాను బదిలీ చేసిన జెండా బదిలీ వేడుకను ప్రస్తావిస్తూ చెప్పారు. ప్రస్తుతం ఘటనపై విచారణ చేపట్టినట్లు సమాచారం.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్






# సర్పంచ్ గా మహేందర్‌రెడ్డి సేవలు మరువలేనివి

- ఘనంగా సన్మానించిన గ్రామ పెద్దలు, ప్రముఖులు

**రామన్నపేట, విశాల భారతి:** సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో బుధవారం రామన్నపేట మండలం వెల్లంకి గ్రామ సర్పంచ్ఎడ్ల మహేందర్ రెడ్డిని గ్రామ పెద్దలు, ప్రముఖులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి సర్పంచ్మహేందర్‌రెడ్డి సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆధ్వర్యంలో గ్రామం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కేంద్రం పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా 2021-22 ఏడాదికి గాను రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పంచాయితీగా వెల్లంకి అవార్డు పొందిందన్నారు. సమగ్రమైన స్వయం సమృద్ధి విభాగంలో ఎన్నికై అవార్డు సాధించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత డా. కూరెళ్ల విఠలాచార్య, ఎంపీటీసీ ఎర్రోళ్ల లక్ష్మమ్మ, ఉప సర్పంచ్ రవ్వ అనసూయ, వార్డు మెంబర్ కన్నెబోయిన రాజ లింగం, ఆవనగంటి నాగేశ్, పోచబోయిన జయ లక్ష్మి, జినుక శాంతి, నకిరేకంటి ఎల్లయ్య, మండల సరిత, బొమ్మకంటి సరిత, గంట కరుణాకర్ రెడ్డి, ఎడ్ల సంజీవ రెడ్డి, గంజి భార్గవి, కరకంటి నరేశ్, కార్యదర్శి యాదయ్య, కో ఆప్షన్ మెంబర్‌తలారి పద్మ, తూడి మురళి, దేషబోయిన రంగయ్య , వివిధ సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మేడారం సమ్మక్క సారలమ్మ జాతర పోస్టర్‌ను బుధవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, సమ్మక్క సారలమ్మ సన్నిధి ఆలయ పూజారులు, ఎండోమెంట్‌అధికారులు ఉన్నారు.

– విశాల భారతి, స్టేట్‌బ్యూరో

# గడువు పొడిగింపు

- వాహనాలదారులకు శుభవార్త
- ఫిబ్రవరి 15వ వరకు పెండింగ్ చలాన్లు కట్టే అవకాశం
- మరోసారి పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

**విశాలభారతి,హైదరాబాద్:**



వాహనదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. వాహనాల పెండింగ్ చలాన్ల రాయితీ గడువు నిన్నటితో ముగియగా.. ఫిబ్రవరి 15వ తేదీ వరకు గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు వాహనదారులు 1.57 కోట్ల పెండింగ్ చలాన్లకు గాను 140 కోట్ల రూపాయలు చెల్లించారు. హైదరాబాద్ కమిషనరేట్ లో 44 లక్షల పెండింగ్ చలాన్లకు ఇప్పటికీ 34 కోట్ల రూపాయలు చెల్లింపులు జరిగాయి. సైబరాబాద్‌లో 25 లక్షల వాహనాల చలాన్లకు 29 కోట్ల రూపాయలు, రాచకొండలో 20 లక్షల పెండింగ్ చలాన్లకు 16 కోట్ల రూపాయలు చెల్లింపులు ఇప్పటి వరకు జరిగాయి. గతంలోనే ఒకసారి పెండింగ్ చలాన్ల రాయితీ గడువు ముగియడంతో ప్రభుత్వం పొడిగించింది. పొడిగించిన గడువు నేటితో తీరిపోనుంది. ఈ మేరకు మరోసారి గడువు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# సిబ్బందిపై దాడిని ఊపేక్షించేది లేదు

- వరుస ఘటనలపై ఆర్టీసీ యాజమాన్యం సీరియస్
- బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరిక
- హయత్ నగర్ ఘటనపై సజ్జనార్ స్ట్రాంగ్ వార్నింగ్
- నిందుతురాలిపై పీఎస్‌లో కేసు నమోదు

**విశాలభారతి,హైదరాబాద్:**




తమ సిబ్బంది విధులకు ఆటకం కలిగించే, దాడులకు పాల్పడే వ్యక్తులపై చట్టప్రకారం చర్యలుంటాయని టీఎస్ఆర్టీసీ హెచ్చరించింది. నిబద్ధత, క్రమశిక్షణతో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తోన్న తమ సిబ్బందిపై కొందరు దాడులకు దిగడాన్ని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేస్తోన్న సిబ్బందిపై దుర్భాషలాడుతూ దాడులు చేయడం ఏమాత్రం సమంజసం కాదని పేర్కొంది. పోలీస్ శాఖ సహకారంతో నేరస్థులపై హిస్టరీ షీట్స్ తెరిచేలా చర్యలు తీసుకుంటామని సంస్థ హెచ్చరించింది. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఎక్స్లో పోస్ట్ చేశారు.
టీఎస్ఆర్టీసీ కండక్టర్లపై ఇటీవల మూడు చోట్ల మహిళలు దాడులకు పాల్పడ్డారు. హయత్‌నగర్ డిపో 1కు చెందిన ఇద్దరు కండక్టర్లపై నానా దుర్భాషలాడుతూ వేర్వేరుగా దాడికి దిగారు. చిల్లర విషయంలో ఒక మహిళ, గుర్తింపు కార్డును చూపించి జీరో టికెట్‌ను తీసుకోవాలని కండక్టర్ చెప్పినందుకు, ఆయన సెల్ ఫోన్ లాక్కుని అసభ్య పదజాలంతో మరో మహిళ దూషించారు. పికెట్ డిపోకు చెందిన మహిళా కండక్టర్‌పై యాదగిరిగుట్టలో కొందరు మహిళలు సాముహికంగా దాడి చేశారు. ఈ మూడు ఘటనలపై రాచకొండ కమిషనరేట్ లోని సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో టీఎస్ఆర్టీసీ అధికారులు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఆ కేసుల దర్యాప్తు ప్రస్తుతం కొనసాగుతోందని, చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. టీఎస్ఆర్టీసీ నియమావళి ప్రకారమే సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని, నిబంధనల మేరకే టికెట్ల జారీ ప్రక్రియను కండక్టర్లు కొనసాగిస్తున్నారని యాజమాన్యం పేర్కొంది.
ప్రయాణికులు ఒక వేళ టికెట్ తీసుకోకుంటే అది చెకింగ్‌లో గుర్తిస్తే ఆ సిబ్బంది ఉద్యోగాలు ప్రమాదంలో పడతాయని, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, అందుకే ప్రతి ఒక్కరూ ప్రయాణ సమయంలో విధిగా టికెట్ తీసుకుని సిబ్బందికి సహకరించాలని టీఎస్ఆర్టీసీ విజ్ఞప్తి చేసింది. మహాలక్ష్మి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య పథకాన్ని తమ సిబ్బంది సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. ఓపిక, సహనంతో విధులు నిర్వర్తిస్తూ ప్రతి రోజూ సగటున 27 లక్షల మంది మహిళా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతున్నారని యాజమాన్యం వెల్లడించింది. ఒరిజనల్ గుర్తింపు కార్డు తప్పని సరి అని సిబ్బంది చెబుతున్నా, కొందరు ఇప్పటికీ ఫొటో కాపీలను, స్మార్ట్ ఫోన్‌లలో గుర్తింపు కార్డులను చూపిస్తున్నారని సంస్థ పేర్కొంది. ఇటీవల జరిగిన దాడి ఘటనలు సిబ్బందిలో ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయడంతో పాటు మనోవేదనకు గురిచేస్తున్నాయని సంస్థ తెలిపింది. మహాలక్ష్మి స్కీంను వినియోగించుకోవాలంటే కచ్చితంగా ఒరిజినల్ గుర్తింపు కార్డును సిబ్బందికి చూపించి.. విధిగా జీరో టికెట్ తీసుకోవాలని టీఎస్ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేసింది.

# పంజాగుట్ట పీఎస్ సిబ్బంది మొత్తం బదిలీ

- హైదరాబాద్ సీపీ సంచలన నిర్ణయం
- మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడి కేసులో నిర్ణయం
- మొత్తం 85 మంది సిబ్బంది ట్రాన్స్‌ఫర్
- ఉత్తర్వులు జారీ చేసిన సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి

**విశాలభారతి,హైదరాబాద్:**




హైదరాబాద్ సీపీ శ్రీనివాస్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో కొంతకాలంగా చోటుచేసుకుంటున్న పరిణామాల దృష్ట్యా ఆయన మొత్తం ఠాణాలోని సిబ్బందిని బదిలీ చేశారు. మొత్తం 85 మంది సిబ్బందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం ఈ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. అయితే సీపీ ఈ నిర్ణయం తీసుకోవడానికి గల కారణం ఠాణా నుంచి వివరాలు బయటకు పొక్కడమేనని పోలీసు వర్గాల్లో టాక్. గత నెల 23న తెల్లవారుజాము 3 గంటల సమయంలో హైదరాబాద్ ప్రజాభవన్ వద్ద ఓ కారు బీభత్సం సృష్టించింది. ప్రజాభవన్ దగ్గర ఉన్న బారికేడ్లపైకి దూసుకెళ్లింది. ఈ విషయాన్ని గమనించిన పోలీసులు వెంటనే కారు దగ్గరకి చేరుకుని వాహనంలో ఉన్న సాహిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. అనంతరం అతడిని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి నిందితుడు తప్పించుకుని ఇంటికి వెళ్లిపోయాడు. అతని స్థానంలో తన కారు డ్రైవర్‌ను పంపించాడు. దీంతో ఇన్‌స్పెక్టర్ దుర్గారావు సాయంతో షకీల్ అనుచరులు సాహిల్‌ను దుబాయ్ పారిపోయేందుకు సహకరించారు.
రోడ్డు ప్రమాదం జరిగిన రోజు బోధన్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్ పంజాగుట్ట సీఐతో ఫోన్‌లో మాట్లాడినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో పాటు సాహిల్ దుబాయ్ పారిపోయేందుకు అబ్దుల్ వాసే సహకరించినట్లు తేల్చారు. అనంతరం సీసీ కెమెరాల్లో రికార్డైన దృశ్యాల ఆధారంగా ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు, సీఐల ఇద్దరి కాల్ రికార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని పోలీసులు దర్యాప్తు చేసి ప్రేమ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. ఈ కేసులో పంజాగుట్ట సీఐ దుర్గారావును సస్పెండ్ చేశారు. బోధన్ ఇన్‌స్పెక్టర్ సహా మరొకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ క్రమంలో పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ సిబ్బంది తీరుపై సీపీ శ్రీనివాస్‌రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. పీఎస్ నుంచి కీలకమైన విషయాలు బయటకు పొక్కడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఐ నుంచి హోంగార్డు వరకు 85 మందిని బదిలీ చేశారు. సిటీ ఆర్మ్‌డ్ రిజర్వు ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని వివిధ పీఎస్‌ల కొత్తగా 82 మంది సిబ్బందిని పంజాగుట్ట పీఎస్‌కు బదిలీ చేశారు.

# హైదరాబాద్ ట్రాఫిక్‌పై సీఎం ఫోకస్

- భవిష్యత్ అవసరాలకు సమగ్ర ప్రణాళిక
- సిటీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల స్థాయి పెంపు
- సిబ్బంది కొరత లేకుండా హోంగార్డుల రిక్రూట్‌మెంట్
- మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్లతో కొత్త విధానం
- ట్రాఫిక్ పై రివ్యూ మీటింగ్‌లో సీఎం రేవంత్ రెడ్డి

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**





గ్రేటర్ హైదరాబాద్ సిటీలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ముందు చూపుతో చర్యలు చేపట్టాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణను పోలీస్ విభాగం అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ, పోలీసు విభాగాలు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్‌నిర్వహణ, నియంత్రణపై బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు.
హైదరాబాద్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా గ్రేటర్ సిటీలో ట్రాఫిక్ నియంత్రణ, నిర్వహణపై సమగ్ర ప్రణాళికను రూపొందించాలని సీఎం సూచించారు. అందులో నిపుణులైన కన్సల్టెన్సీలకు బాధ్యతలు అప్పగించి ప్రత్యేకంగా అధ్యయనం చేయించాలన్నారు. పెరిగిన వాహనాల సంఖ్యకు అనుగుణంగా ట్రాఫిక్ సిబ్బంది అందుబాటులో లేరని సమావేశంలో చర్చకు వచ్చింది. స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే తగినంత మంది హోంగార్డుల నియామకాలు చేపట్టాలని ఆదేశించారు. మూడు నెలల్లోగా ఈ నియామకాలు జరిగేలా ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. కొత్తగా నియమించిన వారికి తగిన శిక్షణనివ్వాలని సూచించారు. ఈ లోపు వివిధ విభాగాల్లో పని చేస్తున్న హోంగార్డులను ట్రాఫిక్ విభాగానికి తిరిగి రప్పించాలని.. తక్షణమే వారి సేవలను వినియోగించుకోవాలని చెప్పారు.
ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో(పీక్ అవర్స్‌లో) లా అండ్ ఆర్డర్ పోలీసులను గ్రేటర్ సిటీ ట్రాఫిక్ కంట్రోల్ విధులకు వినియోగించుకోవాలని అన్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమీషనరేట్ల పరిధిలో ఉన్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల స్థాయిని అప్ గ్రేడ్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. వాటికి సరిపడే సంఖ్యలో సిబ్బంది నియామకాలు చేపట్టాలని సీఎం చెప్పారు. సిటీలోని అన్ని ప్రధాన జంక్షన్లు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ సిబ్బంది తప్పకుండా అక్కడ ఉండేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కేవలం ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థ మీద ఆధారపడకూడదని అన్నారు. టూ వీలర్ ట్రాఫిక్ ఇంటర్సెప్టర్స్‌పై ఎస్ఐలు, కానిస్టేబుళ్లను పంపించి ట్రాఫిక్ జామ్ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ప్రధాన రహదారులు, జంక్షన్ల విస్తరణపై దృష్టి పెట్టాలని అన్నారు. ఎల్బీ నగర్ జంక్షన్ తరహాలో సబ్ వే, అండర్ పాస్, సర్ఫేస్ వేలను ఎక్కడెక్కడ నిర్మించాలి. అక్కడున్న సాధ్యాసాధ్యాలను గుర్తించాలని సీఎం అన్నారు.
హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమీషనరేట్ల పోలీస్ అధికారులు, మున్సిపల్ జోనల్ కమీషనర్లు సమన్వయంతో ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టాలని అన్నారు. ప్రతినెలా తప్పనిసరిగా సమావేశమై ట్రాఫిక్ ఇబ్బందులను సమీక్షించి, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పార్కింగ్ సమస్యను అధిగమిస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తొలిగిపోతాయనే చర్చ జరిగింది. వీలైనన్ని చోట్ల మల్టీలెవల్ కార్ పార్కింగ్ సెంటర్ల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రైవేటు, ప్రభుత్వ స్థలాలు గుర్తించాలని, పార్కింగ్ సెంటర్ల ఏర్పాటుకు ముందుకొచ్చేవారికి ప్రభుత్వ పరంగా రాయితీలు ఇవ్వాలని సీఎం అన్నారు. అన్ని విధివిధానాలతో ప్రత్యేక పార్కింగ్ పాలసీని రూపొందించాలని సీఎం ఆదేశించారు. లే అవుట్లకు హెచ్ఎండిఏ అనుమతులు ఇచ్చేటప్పుడు అక్కడ రోడ్లు, పార్కులు, మౌలిక వసతులకు ఎంత స్థలం కేటాయించాలనే ప్రమాణాలు పున:పరిశీలించాలని సీఎం ఆదేశించారు. విశాలమైన రోడ్లు ఉండేలా దేశంలోని ఇతర నగరాలు, విదేశాల్లో ఎలాంటి పద్దతులను అనుసరిస్తున్నారో పరిశీలించాలని సీఎం సూచించారు. హైదరాబాద్‌లో బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులు ఇచ్చేటప్పుడు ఆ ఏరియాలో ఉండే ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకోవాలని సీఎం ఆదేశించారు.

# వైసీపీలో చేరిన రావెల

- జగన్ పేదలకు ఎంతో సేవ చేస్తున్నారని కామెంట్
- సీఎం సమక్షంలో కండువా కప్పుకున్న మాజీ మంత్రి

**విశాలభారతి,ఆంధ్ర ప్రదేశ్:**



అంబేద్కర్ ఆశయాల్ని నెరవేరుస్తున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఆయన పేదలకు చేస్తున్న సేవ తనను ఆకట్టుకుందని ఏపీ మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు అన్నారు. బుధవారం మధ్యాహ్నం సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారాయన.
''అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చుతున్న సీఎం జగన్ మాత్రమే. పేద, బడుగు, బలహీన వర్గాల రాజకీయ కలను జగన్ సాకారం చేస్తున్నారు. రెండున్నర లక్షల కోట్ల రూపాయలు పేదల ఖాతాలో జమ చేయటం ఒక చరిత్ర. డ్వాక్రా మహిళలను గత పాలకులు ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారు. జగన్ మాత్రం వారి రుణాలను విడతల వారీగా మాఫీ చేశారు . అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా జగన్ చూస్తున్నారు. పేదలకు చేస్తున్న సేవలను చూసి వైఎస్సార్‌సీపీలో చేరాను. పార్టీ కోసం జగన్ ఏం చెప్తే అది చేయడానికి సిద్ధం. ఒక విధేయుడిగా ఉంటా అని రావెల తెలిపారు. ఐఆర్‌టీఎస్ మాజీ అధికారి అయిన రావెల 2014లో గుంటూరు ప్రత్తిపాడు (ఎస్సీ) నియోజకవర్గంలో టీడీపీ నుంచి పోటీ చేసి నెగ్గారు. టీడీపీ ప్రభుత్వం

# మెగా డీఎస్సీకి ఏపీ సర్కారు గ్రీన్ సిగ్నల్

- 6100 పోస్టులతో నియామకాలు
- వైఎస్సార్ చేయూత 4వ విడతకు ఆమోదం
- యూనివర్సిటీలు, విద్యాసంస్థల్లోని
- నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ పదవీ విరమణ వయసు పెంపు
- ఏపీ కేబినెట్లో కీలక నిర్ణయాలు

**విశాలభారతి,ఆంధ్ర ప్రదేశ్ :** ఏపీ సీఎం జగన్ నేతృత్వంలో సమావేశమైన ఏపీ మంత్రి మండలి బుధవారం పలు కీలక నిర్ణయాలను తీసుకున్నది. మెగా డీఎస్సీకి ఏపీ సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంతేకాక వైఎస్సార్ చేయూత నాలుగో విడతకు ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయం మొదటి బ్లాక్‌లో మంత్రి వర్గ సమావేశం జరిగింది. పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఏపీలో నిరుద్యోగులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 6,100 పోస్టులతో డీఎస్సీ నిర్వహణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు గ్రీన్‌సిగ్నల్ తెలిపింది. 6,100 పోస్టులతో డీఎస్సీ నిర్వహించనున్నారు. వైఎస్సార్ చేయూత 4వ విడతకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు రూ.5వేల కోట్ల నిధుల విడుదలకు మంత్రివర్గం ఓకే చెప్పింది.



**కేబినెట్ ఆమోదించిన మరికొన్ని అంశాలు**

- ఎస్ఐపీబీ ఆమోదించిన తీర్మానాలకు గ్రీన్ సిగ్నల్
- ఇంధన రంగంలో 22 వేల కోట్ల పెట్టుబడుల ప్రాతిపాదనలకు ఓకే
- ప్రతి గ్రామ పంచాయతీకి పంచాయతీ సెక్రటరీ
- ఎస్ఈఆర్టీలోకి ఐబీ భాగస్వామ్యం
- యూనివర్శిటీలు, ఉన్నత విద్యా సంస్థల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది పదవీ విరమణ వయసు 60 నుంచి 62కు పెంపు
- అటవీశాఖలో 689 పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం
- నంద్యాల, కర్నూలు జిల్లాల్లో రెండు విండ్ పవర్ ప్రాజెక్టులకు ఆమోదం

# పదవీ కాలం పొడగించేలా ఆదేశించండి

- హైకోర్టును ఆశ్రయించిన తెలంగాణ సర్పంచులు
- నేటితో వారి పదవికాలం ముగింపు
- మరో ఆరు నెలలు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి
- విచారణ నాలుగు వారాలకు వాయిదా

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



గ్రామ పంచాయతీల్లో పాలక వర్గం పాలన నేటితో ముగయనున్నది. రాష్ట్రంలోని సర్పంచులు హైకోర్టును ఆశ్రయించారు. వారి పదవీ కాలం ముగియనుండటంతో ప్రత్యేక అధికారులను నియమించకుండా సకాలంలో ఎన్నికలు నిర్వహించేలా ఆదేశించాలని పిటిషన్ వేశారు. ఎన్నికలు నిర్వహించడం కుదరకపోతే తమ పదవీ కాలాన్ని పొడిగించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని సర్పంచులు కోరారు. అలాగే ప్రత్యేక అధికారుల నియామకంపై స్టే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కాగా, స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. అయితే తమకు మరో ఆరు నెలలు అవకాశం ఇచ్చి, పర్సన్ ఇన్‌చార్జిలను నియమించాలని సర్పంచులు ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ పట్టించుకోలేదు. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన మొదలవనుండగా మరో ఆరు నెలల తర్వాతనే రాష్ట్రంలో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నది. అప్పటి వరకు ప్రత్యేక అధికారులే పాలన చేయనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టాల్సిన ఆరు గ్యారెంటీలపై మొదట దృష్టి పెట్టింది. ఆ గ్యారెంటీలు అమలు చేసే లోపే పార్లమెంట్ ఎన్నికలు రానున్నాయి. పార్లమెంట్ ఎన్నికలు అయ్యాక కొత్త ప్రభుత్వం స్థానిక రిజర్వేషన్లు మార్చాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత పాత రిజర్వేషన్లే అయితే జూన్ లేదా జూలైలో ఈ పల్లె పోరు జరుగనున్నది. ఒక వేళ రిజర్వేషన్లు మార్చాలి అంటే మరోసారి చట్టం చేయాల్సి ఉండే అవకాశం ఉన్నందున మరికొంత ఆలస్యం కానుంది. ఇదిలా ఉండగా ఇదే సంవత్సరంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు కూడా జరుగనున్నాయి.

# షర్మిలకు సెక్యూరిటీ కుదింపు

- ఫోర్ ప్లస్ ఫోర్ తగ్గింపు
- మండిపడుతున్న కాంగ్రెస్ శ్రేణులు
- భద్రత పెంచాలని రఘువీరారెడ్డి డిమాండ్



ఆంధ్రప్రదేశ్, విశాలభారతి: రాజకీయంగా జోరు పెంచిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డికి సెక్యూరిటీ తీసేశారు. గతంలో ఫోర్ ప్లస్ ఫోర్ సెక్యూరిటీ ఉండేది. ఇప్పుడు వన్ ప్లస్ వన్ చేశారు. దీనిపై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. సీడబ్ల్యూసీ మెంబర్ రఘువీరారెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం భద్రతను ఫోర్ ప్లస్ ఫోర్‌కు పెంచాలని, పోలీస్ ఎస్కాడ్ వెహికల్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు.వచ్చే ఎన్నికలు, వైసీపీ నేతల బెదిరింపుల కారణంగా తగిన భద్రతను కల్పించాలన్న డిమాండ్లు కొంత కాలంగా ఇతర పార్టీల నుంచి వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత షర్మిల జోరు పెంచారు. ప్రతిపక్షాలు కంటే అధికారంలో ఉన్న తన అన్నపైనే తీవ్ర స్థాయిలో ఆమె వ్యాఖ్యలు చేస్తున్నారు. వైసీపీ సోషల్ మీడియా కూడా అంతే స్థాయిలో షర్మిలపై విమర్శలు గుప్పిస్తున్నారు. మరి కొంత మంది వైసీపీ నాయకులు ముందుకు వచ్చి షర్మిలపై తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ, వైసీపీ మధ్య రోజురోజుకూ అగ్గి రాజుకుంటోంది. వ్యక్తిగత విమర్శలు తారాస్థాయికి చేరిన నేపథ్యంలో.. రానున్న రోజుల్లో మరింత ఇబ్బందికర పరిస్థితి ఉంటుందని అంతా భావిస్తున్నారు. మరి కొద్ది రోజుల్లో షర్మిలారెడ్డి రాష్ట్ర వ్యాప్త పర్యటనకు సిద్ధమవుతున్నారు. జగన్‌పై విమర్శలు చేసిన నేపథ్యంలో వైసీపీ శ్రేణులు నుంచి ఇబ్బందులుంటాయనో, ఇతర గొడవలకు ఆస్కారం ఇవ్వకూడదన్న ఉద్దేశంతోనో షర్మిల భద్రత పెంపుపై డీజీపీకి లేఖ రాసినట్టు చెబుతున్నారు. దీనివల్ల కాంగ్రెస్ పార్టీ నిర్వహించే సమావేశాలు సజావుగా సాగే అవకాశముందని పేర్కొంటున్నారు. అందుకే తొలగించిన భద్రత కల్పించాలని కోరుతున్నారు.



## పొంగులేటితో పర్యటనలో పాల్గొన్న చావా

**పాలేరు, విశాలభారతి:** తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బుధవారం పాలేరు నియోజకవర్గంలో పర్యటించారు. వారితోపాటు పర్యటనలో పాలేరు నియోజకవర్గ నాయకులు చావా శివరామకృష్ణ పాల్గొన్నారు పర్యటనలో భాగంగా తొలుత ఉదయం పది గంటలకు కూసుమంచిలోని పాలేరు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో కూసుమంచి, నేలకొండపల్లి మండలాలకు చెందిన కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం కూసుమంచి మండలంలోని బురేన్ గుట్ట తండా టూ గోరిలపాడు తండా వరకు, రాజుపేట, పెరికసింగారం, ఆర్ అండ్ బీ రోడ్డు టూ గోరిలపాడు తండా వరకు నిర్మించనున్న బీటీ రోడ్లకు శంఖుస్థాపన చేస్తారు.

# ముట్టడిని జయప్రదం చేయండి

**సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి**

సూర్యాపేట, విశాలభారతి

: నాగార్జునసాగర్ ఎడమ కాలువ కు నీటిని విడుదల చేసి ఎండిపోతున్న వరి పంటలను కాపాడాలని కోరుతూ ఫిబ్రవరి 2న సాగర్ ఎస్ఈ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో నిర్వహించిన సిపిఎం పార్టీ జిల్లా కమిటీ, మండల కార్యదర్శిల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాగర్ ఎడమ కాలువ పరిధిలో బోరు బావుల కింద సాగుచేసిన వరిచేలు చేతికొచ్చే దశలో ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగర్ ప్రాజెక్టులో నీటి లభ్యతను బట్టి ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపి భూగర్భ జలాలు పెంపొందించి పంటలను కాపాడాలని కోరారు. భవిష్యత్ అవసరాల రీత్యా ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్ నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ముందుగా



ఎడమ కాలువ పరిధిలో చెరువులను నింపి రైతుల ఇబ్బందులు తొలగించాలన్నారు. సిపిఎం పార్టీ,రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 2వ తేదీన సాగర్ ఎస్ఈ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నామన్నారు. రైతాంగానికి రావలసిన రైతుబంధు డబ్బులు వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలనికోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీ స్కీములను వెంటనేవిడుదల చేయాలని కోరారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇళ్లకు నిధులు కేటాయించి పూర్తిచేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, పారేపల్లి శేఖర్ రావు,బుర్రి శ్రీరాములు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోట గోపి కార్యదర్శిలు పాల్గొన్నారు.



## సన్మాన కార్యక్రమం

**గరిడేపల్లి, విశాలభారతి:** మండల పరిధిలో ఉన్న పరెడ్డిగూడెం గ్రామపంచాయతీలో ఈరోజు తో సర్పంచుల పదవికాలం పూర్తయిన సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బంది వార్డు మెంబర్లు అందరు కలిసి గ్రామ సర్పంచ్ వీరం రెడ్డి లక్ష్మీశంబిరెడ్డిని ప్రత్యేక పూలమాలతో శాలువాతో సన్మానించారు. ఈ ఐదేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దామని గ్రామంలో ఏ సమస్య లేకుండా ప్రతి సమస్యను మన సొంత సమస్య లాగా భావించి గ్రామ ప్రజలకు అందుబాటులో ఉన్నామని ఐదేళ్ల కాలంలో అందరం పార్టీలకతీతంగా సోదరా భావంతో ఉండి ప్రజలకు అనేక పనులు చేశామని వారు వార్డు మెంబర్లతో పంచుకున్నారు. వార్డు మెంబర్లను ప్రత్యేక శాలువాతో పూలమాలతో సన్మానం చేశారు. అదేవిధంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుగులోతు సైదా నాయక్ ని ప్రత్యేకంగా సన్మానం చేశారు.



## ఘనంగా జెన్నారెడ్డి వివేక్ రెడ్డి జన్మదిన వేడుకలు

**నూతనకల్, విశాలభారతి:** రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జెన్నారెడ్డి వివేక్ రెడ్డి జన్మదిన వేడుకలు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించరు. వివేక్ రెడ్డి జన్మదిన సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కటింగ్ చేసి పండ్లు, బ్రెడ్లు రోగులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జెన్నారెడ్డి వివేక్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఇంకా ఎక్కువ సేవా కార్యక్రమాలు చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు తీగల గిరిధర్ రెడ్డి, ధరిపల్లి వీరన్న, పన్నాల మల్లారెడ్డి, బొడ్డుపల్లి అంజయ్య, సర్పంచ్ బొల్లేపల్లి అశోక్ యువజన కాంగ్రెస్ నాయకులు ఇరుగు కిరణ్, మూడ్ మోహన్ నాయక్, కొంగల నరేష్, వీరబోయిన వెంకన్న, అనంతుల మహేష్, మొరిగాల రమేష్ పాల్గొన్నారు.



## నిఘాను పటిష్టం చేయాలి

**రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణ, రెగ్యులేషన్ చేయాలి**

**సూర్యాపేట, విశాలభారతి:** జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఐపిఎస్, ట్రైనీ ఐపిఎస్ అధికారి రాజేష్ మీనా తో కలిసి బుధవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసినారు. స్టేషన్ నిర్వహణ డైరీ, పిటిషన్ మేనేజ్మెంట్ రిజిష్టర్, డయల్ 100 కాల్ స్పందనను పరిశీలించారు. అనంతరం ఎస్పి మాట్లాడుతూ పట్టణంలో నిఘా కట్టుదిట్టం చేయాలని, నిరంతరం పెట్రోలింగ్ చేయాలని ఆదేశించారు. నిఘా సిబ్బంది అప్రమత్తంగా ఉండి అనుమానితుల సమాచారాన్ని సేకరించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో వ్యాపారాల నిర్వహకులు రాత్రి వేళ సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపినారు. ఎక్కువ మొత్తం లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయించాలని అన్నారు.

జిల్లా కేంద్రంలో ప్రజల అవసరాల దృష్ట్యా రోడ్లపై రద్దీ బాగా పెరుగుతుంది, రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణ, రెగ్యులేషన్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బంది నిర్వహణ కచ్చితంగా ఉండాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ బాగా పని చేయాలని కోరారు.ఎస్పి వెంట ట్రైన్ ఐపీఎస్ అధికారి రాజేష్ మీనా, పట్టణ ఇనపెక్టర్ రాజశేఖర్, ట్రాఫిక్ ఎస్ఐ నవీన్, సిబ్బంది ఉన్నారు.



## చెక్కు అందజేసిన ఎమ్మెల్యే మందుల సామేలు

**శాలిగౌరారం, విశాలభారతి:** ఊట్కూరు గ్రామానికి చెందిన బొమ్మగాని లింగయ్య ఇటీవల కాలంలో మృతి చెందాడు. ఈ సందర్భంగా బొమ్మగాని లింగయ్య కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం కలిగి ఉండడంతో కాంగ్రెస్ పార్టీ బీమా కింద మంజూరైన 2 లక్షల చెక్కును బొమ్మగాని లింగయ్య సతీమణికి స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని, కాంగ్రెస్ పార్టీ కుటుంబాలను కాపాడుకుంటామని ఎమ్మెల్యే మందుల సామేలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అన్నెబొయిన సుధాకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సమరం రెడ్డి,ఊట్కూర్ గ్రామ శాఖ అధ్యక్షులు కుర్ర లింగయ్య,కాంగ్రెస్ నాయకులు పాకాల సతీష్, వేముల గోపినాథ్, రంగు బిక్షం, దేవనబోయిన సైదులు , శీలం శంకర్, జహంగీర్, కుర్ర సాగర్, రామ్ మోహన్ ,దేవన బోయిన నాగయ్య,మెట్టు శ్రీను, పల్స శ్రీను, కట్లకుంట్ల రమేష్ ,మెట్టు శ్రీను,కప్పల సైదులు, వేముల చంద్రయ్య, కుంభం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుట్టాలి

**పట్టభద్రులు ఓటుకి దరఖాస్తు చేసుకోవాలి**



**చిట్యాల, విశాలభారతి:** మనం వేసే ఓటు సమాజ అభివృద్ధికి నాంది పలికే విధంగా ఉండాలని అందుకు సరైన నిర్ణయం తీసుకుని ఓటు వేయాలన్నారు. నల్లగొండ వరంగల్ ఖమ్మం శాసన మండలి నియోజకవర్గం లోని పట్టభద్రుల ఓటు హక్కు నమోదు కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ఉద్యమ సీనియర్ నేత బిఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లపు బుద్ధుడు ఓటు నమోదు పత్రాలను డిప్యూటీ తహసిల్దార్ వి.రాగ్యా నాయక్ కి అందజేశారు.ఈ సందర్భంగా పల్లపు బుద్ధుడు మాట్లాడుతూ 2020 నవంబర్ 1 నాటికి డిగ్రీ ఉత్తీర్ణత చెందిన ప్రతి పట్టభద్రులు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి అని పిలుపునిచ్చారు. పట్టభద్రు లు తమ ఓటు హక్కు ద్వారా ఈ విద్యా వ్యవస్థలో మార్పులు చేర్పులు విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాలపైన మనం ఎన్నుకున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ద్వారా పరిష్కారాలు చేసుకొనుటకై కృషి చేయడానికి దోహదపడుతుందన్నారు.విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరం కంకణ బద్దులమై 2020 నవంబర్ వరకు డిగ్రీ పట్టా పొందిన ప్రతి పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని చివరి తేదీ ఫిబ్రవరి 6 వరకు ఉంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రులు పాకాల దినేష్, శ్రీను, సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.



## క్యాలెండర్ ను ఆవిష్కరించిన మాజీ మంత్రి

**సూర్యాపేట, విశాలభారతి:** ప్రజల సమస్యలను పరిష్కరించడంలో సమాచార హక్కు వికాస సమితి ముందుండాలని మాజీ మంత్రి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమాచార హక్కు వికాస సమితి క్యాలెండర్ ను బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలను చైతన్య కలిగించడంలో ఇటీవల సమాచార హక్కు చట్టం పై అవగాహన కలిగించడంలో సమాచార హక్కు వికాస సమితి పాత్ర ఎనలేనిదని సమాచార హక్కు చట్టం ప్రజలందరికీ వర్తించాలని అన్నారు. ఇటీవల కాలంలో సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో చైతన్యం కలిగిందని అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించడంలో సమాచార హక్కు చట్టం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి,సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎర్రమాద కృష్ణారెడ్డి, గౌరవ సలహాదారు కోటగిరి దైవ దీనం, జిల్లా అధ్యక్షుడు గుంటకండ్ల ముకుంద రెడ్డి, కార్యదర్శి చేకూరి శివ, సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షుడు దండ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## విశాలభారతి క్యాలెండర్ ఆవిష్కరించిన మున్సిపల్ చైర్మన్

**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రం మున్సిపల్ ఛాంబర్ లో విశాల భారతి దినపత్రిక క్యాలెండర్ ని మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారదులు పత్రిక సంస్థలు అని అందులో ముందు వరుసలో ఉండే పత్రిక విశాలభారతి దిన పత్రిక అని కొనియాడారు. యాజమాన్యాలు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం గౌడ్, కౌన్సిలర్లు సంద గళ్ళ విజయ సతీష్ గౌడ్, తాండూరు శిరీష పరమేష్ ఉప సర్పంచ్ మహేష్ , నాయకులు తూర్పునూరు రవి, పబ్బతి శ్రీనివాస్, నాగమ్మ, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## అవార్డు గ్రహీతను సన్మానించిన పాకాల

**భద్రాచలం, విశాలభారతి:** బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డును తీసుకున్న భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. దేవదాస్ ను ప్రముఖ ఐటీసీ పీఎస్ పీడీ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాకాల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గిరి బిడ్డల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రిన్సిపల్ దేవదాసును ఆయన అభినందించారు. ప్రిన్సిపాల్ చేస్తున్న సేవలను తాము ప్రత్యక్షంగా చూస్తున్నామని ఇటువంటి ప్రిన్సిపాల్ దొరకటం గిరి బిడ్డల అదృష్టం అన్నారు. ఎంతోమందిని ఇంజనీర్లుగా, డాక్టర్లుగా తీర్చిదిద్దిన ఘనత ప్రిన్సిపల్ దేవదాస్ కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్, టిడిపి నాయకులు ఎస్.కె అజీమ్, వైస్ ప్రిన్సిపాల్ సి.బసవకుమారి, సీనియర్ లెక్చరర్స్ కె.జ్యోత్స్న, పి వసంత కుమారి, ఆర్ శారద, కె.అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధికి అంకితభావంతో పనిచేశాను

- ఐదేళ్ల పదవీకాలం తృప్తినిచ్చింది
- హరిపిరాల సర్పంచ్ రావుల మమతారెడ్డి

**తొర్రూరు, విశాలభారతి:** గ్రామాభివృద్ధికి అంకిత భావంతో పనిచేశానని, ఐదేళ్ల పదవీకాలం తనకు తృప్తినిచ్చిందని హరిపిరాల సర్పంచ్ రావుల మమతారెడ్డి తెలిపారు. ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న సర్పంచ్ రావుల మమతారెడ్డిని తొర్రూరు మండలంలోని హరిపిరాల గ్రామపంచాయతీ కార్యాలయంలో సత్కరించారు. వారితోపాటు ఇతర పాలకవర్గాన్ని సన్మానించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ. ప్రజల సహకారంతో రూ. కోట్ల నిధులు తెప్పించి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అందించిన నిధులతో పాటు సొంతంగా గ్రామ అభివృద్ధికి రూ.25 లక్షలు మేర వెచ్చించానని తెలిపారు.

ఎస్సారెస్పీ కాలువ నుండి చెరువు వరకు కాలువ, కల్వర్టుల నిర్మాణంకై రూ.7.50 లక్షలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గోడలకు రంగులు, విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుకై రూ. 3 లక్షలు , హరిపిరాల నుంచి రావులపెల్లికి వెళ్లే రోడ్డు అభివృద్ధి నిమిత్తం రూ.3 లక్షలు , రూ.2 లక్షలతో సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రాథమిక పాఠశాలలో మూత్రశాలల ఏర్పాటుకు రూ.1.35 లక్షలు, రూ. 1.20 లక్షలు వెచ్చించి బతుకమ్మ విగ్రహం ఏర్పాటు, శివాలయం అభివృద్ధికి రూ.1.50 లక్షలు, చీకటాయపాలెం రోడ్డులో మొరం పోయిస్తే రూ.1.50 లక్షలు, తొర్రూరులో 100 అడుగుల జాతీయ పతాకం ఏర్పాటుకు రూ. 50 వేలు, పలు పనుల నిమిత్తం సొంతంగా డబ్బులు వెచ్చించి అభివృద్ధి చేసినట్లు గుర్తు చేశారు.

ప్రజలు, పాలకవర్గం సమిష్టి కృషి, అధికారుల సహకారం మూలంగానే పంచాయతీ అభివృద్ధి సాధించిందన్నారు. భయంకరమైన కరోనా కాలంలో ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి అందించినట్లు గుర్తు చేశారు. హరితహారం కింద వేలాది మొక్కలు పంపిణీ చేశామని పంచాయతీలో పచ్చదనం పరిశుభ్రత నిర్వహించామన్నారు. ఐదేళ్ల సర్పంచ్ పాలనలో హరిపిరాల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం పట్ల స్థానికులు సర్పంచ్ ను, పాలకవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వల్లపు గోపమ్మ, పంచాయతీ కార్యదర్శి దేవయ్య, ఉప సర్పంచ్ చెంచర్ల రాజు, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కొండ వెంకన్న,వార్డు సభ్యులు ముత్తయ్య, తోట మురళి, ఐలోను, ఉప్పమ్మ, మౌనిక, జయమ్మ, స్థానికులు బిక్షపతి, బుర్రి మురళి, వీర సోములు, రాములు, ఎస్కే పాషా, రేష్మ తదితరులు పాల్గొన్నారు.



## పద్మశ్రీ కూరెళ్ళకు బిఎస్పి సన్మానం

- కూరెళ్ల విఠలాచార్య గొప్ప మనిషి
- బి ఎస్ పి నకిరేకల్ నియోజకవర్గ ఇంచార్జి మేడి ప్రియదర్శిని

**రామన్నపేట, విశాలభారతి:** భారత ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం సందర్భంగా సాహిత్య విశిష్ఠ సేవలను గుర్తించి డా. కూరెళ్ళ విఠలాచార్యకు పద్మశ్రీ పురస్కారం లభించిన సందర్భంగా వెల్లంకి గ్రామంలో తన స్వగృహంలో బిఎస్పి ఆద్వర్యంలో సన్మానం చేసి అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా బి ఎస్ పి నకిరేకల్ నియోజకవర్గ ఇంచార్జి మేడి ప్రియదర్శిని మాట్లాడుతూ తనకు మిగిలిన ఏకైక ఆస్తి ఇంటిని గ్రంథాలయంగా మార్చిన గొప్ప మనిషి కవి డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య అని అన్నారు. కూరెళ్ల అందరివాడని, ఆయన సేవలు మనందరికీ అవసరమని అన్నారు.పెన్షన్ డబ్బులతో మహా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి లక్షల పుస్తకాలు సేకరించిన మహోన్నత వ్యక్తి విఠలాచార్య అని కొనియాడారు. చిన్నతనం నుంచే అనేక కష్టాలను చూసిన వ్యక్తి ఏడేళ్ల ప్రాయంలోనే రచనలు చేయడం ఆయనకున్న పట్టుదలకు నిదర్శనమన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనేక సాహితీ,విద్యాసంస్థల ఏర్పాటుకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మేడి సంతోష్, చిట్యాల మండల అధ్యక్షులు జోగు శేఖర్, కేతాపల్లి మండల అధ్యక్షులు ఎడ్ల విజయ్, రామన్నపేట మండల ఉపాధక్షులు గుని రాజు, ప్రధాన కార్యదర్శి నకిరేకంటి నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



## హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

**సూర్యాపేట ఎంపిపి బీరవోలు రవీందర్ రెడ్డి**

**సూర్యాపేట, విశాలభారతి:** రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూర్యాపేట ఎంపిపి బీరవోలు రవీందర్ రెడ్డి , జడ్పీటిసి జీడి బిక్షం అన్నారు. మండల పరిధిలోని సోలిపేట గ్రామంలో బుధవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హక్కులకు ఎలాంటి భంగం కలిగినా చట్టపరమైన చర్యలు చేపట్టి హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు.

పౌరులందరికీ రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందన్నారు. ఒకరు ఇంకొకరిపై వివక్ష చూపితే చట్టా రీత్యా నేరం అవుతుందన్నారు.

ప్రతి ఒక్కరూ పౌర హక్కుల పై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వివక్ష లేకుండా ప్రజలందరూ కలిసిమెలిసి జీవించాలని కోరారు.nఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్,ఆర్ ఐ, సర్పంచ్ బీరవోలు శోభా రాణి,వైస్ ఎంపిపి శ్రీనివాస్ నాయుడు,ఉప సర్పంచ్ నర్రా సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఐసోలేషన్ సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం

**మణుగూరు ప్రభుత్వ హాస్పిటల్ లో మరో మూడు కొత్త విభాగాలు**



**మణుగూరు, విశాలభారతి :** పినపాక నియోజకవర్గం మణుగూరు 100 పడకల ఆసుపత్రిలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో ఉన్నటువంటి పేద ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మూడు విభాగాలను పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు వెంకటేశ్వర్లు మంగళవారం నాడు ప్రారంభించారు.1,పిల్లల సంరక్షణ కేంద్రం ఐసోలేషన్ సెంటర్,2, బ్లడ్ బ్యాంక్ సెంటర్, 3, డెంటిస్ట్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్ళవలసిన అవసరం లేదని మణుగూరులోనే అందరికీ 3 విభాగాలను అందుబాటులోకి వచ్చాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిత్యం ప్రజల కోసమే పనిచేస్తుందని, ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలనేదే పార్టీ ధ్యేయం అన్నారు. అంతేకాకుండా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో వైద్య పరికరాలు తీసుకోవచ్చేదాంట్లో కచ్చితంగా నేను కృషి చేస్తానని అన్నారు. అనంతరం హాస్పిటల్ పరిసర ప్రాంతంలో మొక్కను నాటి, రోగులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య గారు, డి.సి. ఎచ్.ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డాక్టర్ రవిబాబు , సూపర్డెంట్ డాక్టర్ సునీల్ , హాస్పటల్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జోడో యాత్రను ఏ శక్తి ఆపలేదు



**తొర్రూరు, విశాలభారతి:** దేశ సంక్షేమం కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన జోడో న్యాయ యాత్రను అడ్డుకోవాలని చూడటం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ తొర్రూరు మండల,పట్టణ అధ్యక్షులు సుంచు సంతోష్, సోమ రాజశేఖర్ లు అన్నారు. పశ్చిమ బెంగాల్ లో జోడోయాత్రను కొనసాగిస్తున్న రాహుల్ గాంధీ వాహనాలపై బిజెపి గుండాల దాడిని నిరసిస్తూ తొర్రూరు డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు పెదగాని సోమయ్య తో కలిసి వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రజల కోసం పోరాటం చేస్తున్నారని బెదిరింపులు, తాటాకు చప్పుళ్ళకు భయపడ పోరన్నారు. బిజెపి నాయకులు జోడో యాత్రను అడ్డుకోవాలని కాంగ్రెస్ జెండాలు, బ్యానర్లు ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. ఇది రాహుల్ గాంధీ వ్యక్తిగత యాత్ర కాదని, దేశ ప్రజలకు బిజెపి నుంచి విముక్తి కలిగించడం కోసం చేస్తున్న యాత్ర అని స్పష్టం చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోతామని ఇలాంటి కార్యక్రమాలకు బిజెపి నాయకులు పాల్గొనడం సిగ్గుచేటన్నారు. తదితరులు పాల్గొన్నారు. జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ను గెలిపించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేస్తారని ఇలాంటి కుట్రలు పన్నుతున్నారన్నారు. బిజెపి మతం కులం పేరుతో ప్రజలను రెచ్చగొడుతుందన్నారు. రూ 1200 కు గ్యాస్ పెంచి పేద ప్రజలపై భారం పెట్టిందన్నారు. దేశానికి అభివృద్ధి చేయాలనే ఉద్దేశం బిజెపి నేతలకు లేదని విమర్శించారు. జోడో యాత్రకు అడుగడుగునా అడ్డంకులు కల్పిస్తున్న బిజెపికి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తగురీతిలో ప్రజలు బుద్ధి చెప్తారని హెచ్చరించారు.అనంతరం తెలంగాణ సాంస్కృతిక విప్లవం ప్రజా యుద్ధ నౌక గద్దర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ శ్యాంసుందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చెవిటి సధాకర్, ధరావత్ సోమన్న, మెరుగు మల్లేశం గౌడ్,బి. వెంకన్న యాదవ్, ధర్మారపు మహేందర్,బసన బోయిన రాజేష్ యాదవ్, తూర్పాటి రాంబాబు, దేవుడు నాయక్ రవి నాయక్, ఎలగందుల శ్రీనివాస్, జలగం వెంకన్న, కారుపాటి లక్ష్మయ్య, ఈదునూరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## పిఆర్టియూ డైరీల అందజేత

**చిట్యాల, విశాలభారతి :** మున్సిపాలిటీ చైర్మన్ కోమటి రెడ్డి చిన్న వెంకటరెడ్డి ని,పిఆర్టియు మండల అధ్యక్షులు కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోలి స్లీవమ్మలు మర్యాదపూర్వకంగా కలిసి పిఆర్టియు డైరీని అందజేశారు. అనంతరం చిట్యాల జడ్పీ హైస్కూల్ హెచ్ ఎం కొసనం కరుణాకర్ రెడ్డిని కలిసి డైరీ ని అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంబటి సత్తయ్య, మిద్దెల శ్రీధర్, యానాల ప్రతాపరెడ్డి, రవీందర్, సైదులు పాల్గొన్నారు.



## లంచం ఇవ్వండి.. అడవిని ఆక్రమించండి

- వైయస్సార్ నగర్ లో పేదల ఇల్లు కూల్చిన ఫారెస్ట్ అధికారులు
- లంచం ఇచ్చిన వాళ్ళ వైపు కన్నెత్తి చూడని వైనం
- సామాజిక కార్యకర్త కర్నె రవి

**మణుగూరు, విశాలభారతి :** మాకు లంచం ఇస్తే ఎవరైనా సరే పక్కాగా ఫారెస్ట్ ను ఆక్రమించుకోవచ్చు, అయిన వాళ్లకు ఓ లెక్క, కానీ వాళ్లకు దెబ్బలు పక్కా అన్నట్లుగా మణుగూరు ఫారెస్ట్ అధికారులు వింత పోకడలు అనుసరిస్తున్నారని మణుగూరుకు చెందిన సామాజిక కార్యకర్త కర్నె రవి అగ్రహం వ్యక్తం చేశారు. మణుగూరు మండలం కూనవరం పంచాయతీ పరిధిలోని వైయస్సార్ నగర్ లో గత 25 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదవాళ్ల ఇండ్లను ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బోడ రవి కూల్చుతుండగా, అడ్డుపడిన బాధితులపై జెసిబి ని నడిపించి వారిని తీవ్రంగా గాయపరచడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. అక్కడే ఎందరో బడా బాబులు నివాసం ఉంటున్నప్పటికీ వారి ఇల్లు కూల్చకుండా, కేవలం పేదవాళ్ల ఇల్లు మాత్రమే కూల్చడంలో ఎందుకు శ్రద్ధ తీసుకుంటున్నారో అర్థమవుతుందన్నారు. లంచం ఇచ్చిన వారికి అడవిని దారా దత్తం చేస్తూ, పేదవాళ్లను మాత్రం హింసిస్తున్నారని, ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్తానన్నారు.



## కృష్ణకుమార్ సేవలు అభినందనీయం

**సూర్యాపేట, విశాలభారతి:** ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ నాలుగు సార్లు పొందిన సమాజ సేవకులు, ప్రముఖ కళాకారులు డాక్టర్ పెండెం కృష్ణకుమార్ సూర్యాపేట మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిల్లలమర్రి నందు సర్వేపల్లి రాధాకృష్ణ, సావిత్రిబాయి, పూలే, కొండాలక్ష్మణ్ బాపూజీ,శ్రీనివాస రామానుజన్ చిత్ర పటాలతో పాటు వాటర్ క్యాన్, క్లాత్ బ్యాగ్స్ మొదలైన సామాగ్రిని ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగాప్రధానోపాధ్యాయురాలు కస్తూరి శ్రీదేవి గారు మాట్లాడుతూ దాత డా.పెండెం కృష్ణ కుమార్ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కొరకు ,పాఠశాల విద్యార్థులలో నైతిక విలువలు,దేశభక్తి పెరగడం కోసం పాటుపడుతున్నారని,అంతేకాకుండా చలివేంద్రాలు,పేదలకు ఉచితం మందులపంపిణీ, అనాధాశ్రమాలలో మెడికల్ కిట్స్, హాస్పిటల్లలో వీల్ చైర్స్ ఇలా ఎంతో మందికి ఎన్నో రకాలుగా సేవలు చేస్తున్నారని ఇవే కాక నాలుగు సార్లు గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించి,ప్రపంచంలో ఎవరూ చేయని విధంగా మూడు వందల రకాల పాత్రలు వేసి రికార్డులకెక్కి అంతర్జాతీయ గుర్తింపు పొందారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సునీతా రాణి,సత్యనారాయణ,శ్రీనివాస రావు,నామ నాగయ్య, సైదా నాయక్,విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు

**దేవరుప్పుల, విశాలభారతి:** ధర్మాపురం గ్రామానికి చెందిన పిట్టల అంజయ్య ముదిరాజ్ 2019 సంవత్సరంలో అనారోగ్యంతో మరణించగా మండలకేంద్రంలోని తపాలా కార్యాలయంలో అతని ఈజీఎస్ డబ్బులు 10వేల రూపాయలు ఉన్న సంగతి తెలుసుకున్న అంజయ్య భార్య అంజమ్మ గత ప్రభుత్వ అధికారులకు,పాలకులకు ఎన్నిసార్లు చెప్పినా వాళ్ళు పట్టించుకోలేదని అంజమ్మ తెలిపింది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా తన సమస్యను పరిష్కరిస్తుందోనని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి గౌడ్ కు తన సమస్యను విన్నవించి కన్నీరు పెట్టుకోగా స్పందించిన పెద్ది కృష్ణమూర్తి మండల అధికారులు ఎపిఓ,ఎంపీడీవో, ఎస్పిఎం లకు అంజమ్మ విషయాన్ని తెలుపగా అధికారులు స్పందించి ఆమెకు డబ్బులు వచ్చేటట్లు చేశారు.అందులో భాగంగానే నేడు తపాలా కార్యాలయ సిబ్బంది ఆంజమ్మకు 10వేల రూపాయల చెక్కు వచ్చిందని తెలుపగా తపాలా కార్యాలయానికి చేరుకున్న అంజమ్మకు పెద్ది కృష్ణమూర్తి గౌడ్ తో కలిసి చెక్కును అంజమ్మకు అందజేసిన ఎస్పిఎం రవి.ఈ కార్యక్రమంలో మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు సజ్జన్ నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ మోహన్ లాల్, మాసంపల్లి మహేందర్, రుద్రోజు చారీ,పత్తేపురపు శేఖర్,చింత నిఖిల్,తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల ఆకస్మిక తనిఖీ

- పిల్లలకు పౌష్టికాహారం అందించుటలో రాజీ పడొద్దు
- ప్రతి కేంద్రాలన్ని పరిశుభ్రంగా ఉంచాలి
- జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్



**సూర్యాపేట, విశాలభారతి:** బిబీగూడెం లోని అంగన్వాడీ సెంటర్, ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. అంగన్వాడి సేంటరులోని పిల్లల వివరాలను, వారికి అందిస్తున్న పౌష్టికాహారన్ని అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం ప్రాథమిక పాఠశాల లో 2 వ తరగతిలో టిచర్ శకుంతల బోర్డు పై వ్రాసిన తెలుగు సరళ పదాలను విద్యార్థి జి.నికెతన్ తో చదివించి పిల్లలను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు ఆటపాటలతో విద్యానందిస్తూ నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. అధికారులు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని , విధిగా పిల్లల బరువు, ఎత్తు చూడాలని అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో తాసిల్దార్ రంగారావు, టీచర్ శకుంతల, ఆర్పి బీబీ, సూపర్వైజర్ ఏంజలీనా, టీచర్ సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



## కామ్రేడ్ వేములపల్లి కిరణ్ ఆశయాలను కొనసాగిద్దాం

**సూర్యాపేట, విశాలభారతి:** పివైఎల్ తొలి తరం నాయకుడు వేములపల్లి కిరణ్ కుమార్ 33 వ వర్ధంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రం లోని కామ్రేడ్ చంద్ర పుల్లా రెడ్డి విజ్ఞాన కేంద్రం తన చిత్ర పటానికి పి వై ఎల్ ఆధ్వర్యంలో పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పి వై ఎల్ జిల్లా కోశాధికారి బండి రవి మాట్లాడుతూ కామ్రేడ్ కిరణ్ దోపిడీ పీడన లేని సమ సమాజ స్థాపన కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా వదిలివేశాడు అని అన్నారు. దేశంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తా అని చెప్పి నేటికీ భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతోనే చెలగాటం ఆడుతున్నారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం ఏట లక్ష పైగా ఉద్యోగాలు భర్తీ చేస్తా అని భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేసింది అని అన్నారు . ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకి నిరుద్యోగ భృతి ఇస్తా అని చెప్పి ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది తక్షణమే నిరుద్యోగుల సమస్యలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించి, ఉచితంగా నిరుద్యోగులకు కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి, ఉచిత భోజన సౌకర్యాలు కల్పించాలి అని అన్నారు. నేటి యువత, విద్యార్థి లోకం దేశంలో రాష్ట్రంలో సమాజంలో జరుగుతున్న అశ్లీల సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడి దోపిడీ పీడన లేని సమాజం కోసం ఉద్యమాలు నిర్మించడమే కామ్రేడ్ వేములపల్లి కిరణ్ కుమార్ ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమం లో కునుకుంట్ల సైదులు, పోలేబోయిన కిరణ్, దేసోజు మధు, బొల్లె వెంకన్న, బోల్క పవన్, పుల్లూరి సింహాద్రి, మందడి శ్రీధర్, పిడమర్తి భరత్ తదితరులు పాల్గొన్నారు.



## పదవి విరమణల సన్మానం

**దేవరుప్పుల, విశాలభారతి:** సింగరాజు పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గోపాల్ దాస్ మల్లేష్,గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్,వార్డు సభ్యుల పదవీ విరమణ నేటితో ముగియనున్న సందర్భంగా వైస్ ఎంపిపి కత్తుల విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గం సమావేశం ఏర్పాటు చేసుకొని ఐదు సంవత్సరాల పదవీకాలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, తీపి గురుతులను చర్చించుకుని ఒకరినొకరు అభినందనలు తెలుపుకొని శాలువాలతో సన్మానించుకున్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**మణుగూరు, విశాలభారతి :** మండలంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న చెరువులో బుధవారం ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమయింది. చెరువులో మృతదేహం తేలి ఉండడంతో స్థానికులు గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. చెరువులో తేలియాడుతున్న మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి ఒంటిపై బ్లూ షర్ట్, జీన్స్ ప్యాంటు ఉన్నాయి. ఎవరికైనా తెలిసినచో పోలీసులకు సమాచారం అందించాలని రాయల స్థానికులను కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.



## ఫిబ్రవరి 3న ఛలో ఢిల్లీ

**పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి రవి**

**కోదాడ, విశాలభారతి:** మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానం 2020 ఉపసంహరించుకోవలని విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద వేలాది మంది విద్యార్థి, యువజన, మేధావులతో జరిగే మహాధర్నాని విజయవంతం చేయాలని పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి రవి అన్నారు. కోదాడ పట్టణంలోని లాల్ బంగ్లాలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో డి రవి పాల్గొని మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం తీసుకొచ్చి విద్యారంగంలో గత చరిత్రలను కనుమరుగు చేసి మతోన్మాదాన్ని పెంచి పోషించడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని అన్నారు. విద్య వ్యాపారీకరణ, విద్యా ప్రైవేటీకరణ, విద్యా కార్పోరేటికరణని అమలు చేయడం కోసం మోడీ ప్రభుత్వం రకరకాల చట్టాలను తీసుకొచ్చి విద్యారంగంను నాశనం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టడానికి విద్యార్థులు యువకులు మేధావులు కలిసికట్టుగా ఉద్యమాలు చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగే మహాధర్నను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పీ వై ఎల్ జిల్లా సహాయ కార్యదర్శి సుందరయ్య డివిజన్ ఉపాధ్యక్షులు మురళి, నాయకులు శ్రీను, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడుపై దాడి



**మణుగూరు, విశాలభారతి :** మణుగూరులో ఒక సైకో వీరంగం సృష్టించాడు. దారిన పోతున్న వ్యక్తులపై వివిధ రకాలుగా దాడులకు పాల్పడుతున్నాడు. చేతిలో ఏది ఉంటే దానితో కిరాతకంగా కొడుతున్నాడు. మంగళవారం నాడు ఉదయం ఒక ఉపాధ్యాయుడు పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మైపా శంకర్ అనే వ్యక్తి మండలంలోని శ్రీ చైతన్య పాఠశాలలో రెండు సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారు. మంగళవారం తన సొంత ఊరు రాజపేట నుంచి ఆర్టిసి బస్సులో పాఠశాలకు బయలుదేరి మణుగూరు సురక్ష బస్టాండ్ లో దిగారు , అక్కడ పాఠశాల బస్ కోసం వేచి చూస్తున్నారు, ఈ క్రమంలో మండలానికి చెందిన అస్లాం అనే సింగరేణి ఉద్యోగి మద్యం తాగి బస్టాండ్ చుట్టూ తిరుగుతూ మహిళలలో ఇబ్బంది పెట్టారని అక్కడ ఉన్న స్థానికులు చెబుతున్నారు. గతంలో కూడా కొందరిపై దాడి చేశాడని తెలిసింది. అయితే ఈలోగా శ్రీ చైతన్య ఉపాధ్యాయుడు శంకర్ స్కూల్ బస్ కోసం వేచి చూస్తుండగా అకస్మాత్తుగా వెనుక నుండి వచ్చి తన సెల్ఫోన్తో శంకర్ తలపై తీవ్రంగా దాడి చేశాడని ఉపాధ్యాయుడు తెలిపాడు. అక్కడ అతనికి దొరికిన వస్తువులతో షట్టర్ కేసి కొట్టాడు. అసలు ఎందుకు కొట్టాడో కూడా తెలియదని ఉపాధ్యాయుడు చెప్పడం గమనార్హం. శంకర్ తలకి బలమైన గాయం తగలడంతో అతడిని మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వెంటనే వైద్యులు చికిత్స చేసి శంకర్ తలకి మూడు కుట్లు వేశారు. అనంతరం ఉపాధ్యాయుడు శంకర్ స్కూల్ ప్రిన్సిపల్, డీన్ సహాయంతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.



## గద్దర్ స్మారక అవార్డు వార్డు ప్రకటించాలి

**సికింద్రాబాద్, విశాలభారతి:** తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులు సునీల్ శెట్టి ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట గద్దర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొ. కొండ నాగేశ్వరరావు, ప్రొ. సవిన్ హాజరై మాట్లాడుతూ గద్దర్ స్మారక అవార్డు వార్డు ప్రకటించాలనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మేడి రమణ, డాక్టర్ అందె కృష్ణ, దర్శనం జాన్, వలిగొండ నరసింహ, రవీందర్ నాయక్, మోడం రవి, నాగేశ్వరరావు, సుమంత్,ఉదయ్, భీమ్రావు నాయక్, వేణుగోపాల్, అంబేద్కర్, ఆంజనేయులు ముదిరాజ్, తలారి శ్రీనివాస్, విద్యార్థి నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు. అనంతరం గద్దర్ స్మృతి వనం,ట్యాంక్ బండ్ మీద గద్దర్ విగ్రహం, గద్దర్ జీవితం చరిత్రను తెలంగాణ పాఠ్యాంశంలో చేర్చాలని కోరారు.





# బీఆర్ఎస్ హయాంలో పల్లెల రూపురేఖలు మార్చాం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పెద్ద కంజర్ల, చిన్న కంజర్లలలో రూ. 3 కోట్ల 70 లక్షల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

**పటాన్ చెరు,విశాలభారతి :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో దశాబ్ది కాలంలో గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చామని, ప్రతి గ్రామాన్ని అభివృద్ధికి తార్కానంగా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు మండలం పెద్ద కంజర్ల, చిన్నకంజర్ల గ్రామాలలో మూడు కోట్ల 70 లక్షల రూపాయల అంచనా వేయడంతో చేపట్టిన సిసి రోడ్లు, మహిళా భవనం, కమ్యూనిటీ ఫంక్షన్ హాల్ లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రెండు కోట్ల 85 లక్షల రూపాయలతో ఆధునిక వసతులతో విశాలమైన ప్రాంగణంలో ప్రజల సౌకర్యం ఫంక్షన్ హాల్ నిర్మించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సుప్రజా వెంకట్ రెడ్డి, సర్పంచులు రాజ్ కుమార్, నారాయణ రెడ్డి, ఎంపీటీసీ వెంకటరెడ్డి, పంచాయతీరాజ్ డి ఈ సురేష్, సీనియర్ నాయకుడు దశరథ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఉప సర్పంచ్ హరిశంకర్ గౌడ్, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**ఆధునిక వసతులతో ప్రభుత్వ పాఠశాలలు..**

పటాన్ చెరు నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు, ఆధునిక వసతులతో ప్రభుత్వ పాఠశాల భవనాలను నిర్మిస్తున్నామని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్ చెరు మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో ఎంవైకే లాటిక్రేట్ సంస్థ సౌజన్యంతో 10 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం, ప్రాథమిక పాఠశాల భవనం, అంగన్వాడి భవనం, తోషిబా పరిశ్రమ సహకారంతో కోటి రూపాయల నిధులతో చేపట్టనున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవనం, ఆర్వో ప్లాంట్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ ఏర్పడిన అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ విద్యారంగానికి పెద్దపీట వేయడంతో పాటు మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా వేల కోట్ల రూపాయలు కేటాయించి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సుప్రజా వెంకట్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సుధీర్ రెడ్డి, ఎంపీటీసీ రాజు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాండు, సంస్థ ముఖ్య ప్రతినిధులు శ్రీకర్, రోహిత్, సూర్య ప్రకాష్, ఉప సర్పంచ్ యాదయ్య, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**ముత్తంగిలో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్..**

పటాన్ చెరు మండలం ముత్తంగి గ్రామంలో 20 లక్షల రూపాయలతో నిర్మించిన పల్లె దవాఖాన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, 15 లక్షల రూపాయలతో నిర్మించిన మహిళా సమైక్య భవనాలను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించడంలో పల్లె దవఖానాలు ఎంతగానో ఉపకరిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సుప్రజా వెంకట్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఉపేందర్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, గ్రామ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాలనీలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

**జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి**



**ఎల్బీనగర్,విశాలభారతి:** బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నూతన కమిటీని నియమించుకున్న సందర్భంగా కమిటీ సభ్యులు బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.కాలనీ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరడం జరిగింది. కార్పొరేటర్ మాట్లాడుతూ అతి త్వరలోనే కాలనీలోని ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ముత్యంరావు, నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు రాంరెడ్డి, దామోదర్ రావు, కోశాధికారి పాండురంగం, సంయుక్త కార్యదర్శి అరవింద్ రెడ్డి, వెంకటేశ్వరరావు, సూర్య వర్ధన్ రెడ్డి, బాలకృష్ణ, కార్యవర్గ సభ్యులు యాదయ్య యాదవ్, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వరరావు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు



# మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడండి

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** తుర్కయంజాల్ పురపాలక సంఘ పరిధిలోని ప్రజలు, సకాలంలో ఇంటి పన్నులు, వ్యాపార లైసెన్సులు (ట్రేడ్ లైసెన్సులు) చెల్లించి పుర అభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుర పరిధిలోని పలు వార్డులలో కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్ళి పన్ను వసులు అవుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించుట ద్వారా, అభివృద్ధి త్వరగా జరుగుతుందన్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పినకు, కాలనీల అభివృద్ధికి ప్రజలందరూ కలిసిరావాలన్నారు. స్వచ్ఛందంగా ముందుకువచ్చి ఇంటి పన్నులు, వ్యాపార లైసెన్సులు చెల్లించిన పలువురిని కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్ స్పెక్టర్లు, సానిటరీ ఇన్ స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పుర సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రమాదాలకు నిలయంగా రహదారులు

- రహదారులకు మరమ్మతులు ఎప్పుడు
- తక్షణమే మరమ్మతులు చేపట్టాలి
- సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కొమరం కాంతారావు

**కరకగూడెం, విశాలభారతి:** మండలంలో భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లను తక్షణమే మరమ్మతులు చేయాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కొమరం కాంతారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన బుధవారం నాడు మండలంలోని రఘునాథపాలెం రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని రఘునాథపాలెం వెళ్ళు రహదారి ఆగస్టు నెలలో వచ్చిన భారీ వర్షాల కారణంగా రోడ్డు దారుణంగా దెబ్బతిందని అది ప్రమాదాలకు నిలయంగా మారిందని అన్నారు.రాత్రి వేళలో తెలియని వారు ఎవరైనా వస్తే అందులో పడి ప్రాణాలు పోగొట్టుకోవడం ఖాయమని ప్రమాదం జరిగితే తప్ప అధికారులు స్పందించని నిస్సహాయక స్థితిలో ఉన్నారని వర్షాలకు రోడ్డు దారుణంగా దెబ్బతిందని వారన్నారు. ఇప్పటివరకు అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు తప్ప ఆ రోడ్లను మరమ్మత్తులు చేసి పునరుద్ధరించడంలో అధికారుల చర్యలు మాత్రం శూన్యం అని అన్ అన్నారు. చెవిటోడు ముందు శంఖం ఊదినట్లే ఉందని ప్రజల ప్రాణాలు పోతే మాకేంటి అనే రీతిలో అధికార యంత్రాంగం ఉన్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లను తక్షణమే మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు.



# పోచమ్మ తల్లి చల్లగా దీవించమ్మ

- ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపకులు నీలం మధు
- పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

**పటాన్ చెరు,విశాలభారతి:** పోచమ్మ తల్లి అందరిని చల్లగా దీవించాలని ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జీవించేలా అమ్మవారు కృప చూపాలని ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు నీలం మధు ముదిరాజ్ ప్రార్థించారు. నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో పోచమ్మ తల్లి 8వ వార్షికోత్సవం, జాతర మహోత్సవంలో నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ఆయన ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు నీలం మధు ముదిరాజ్ ను ఘనంగా సత్కరించారు. పోచమ్మ అమ్మవారు ప్రజలందరినీ సుఖసంతోషాలతో సుభిక్షంగా చూడాలని కోరినట్టు తెలిపారు. ఆలయాలతో అధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జాతర నిర్వాహకులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# కష్టపడితేనే ఆర్థిక స్థిరత్వం: హీరో సుమన్

**ఎల్బీనగర్ విశాలభారతి:** కష్టపడితేనే ఆర్థిక స్థిరత్వం ఉంటుందని నమ్మకానికి నాణ్యతకు ప్రత్యేకగా నిలిచిన హాసిని ఎస్టేట్స్ లో కష్టమర్లు పెట్టుబడులు పెడితే తక్కువ రోజులలో ఎక్కువ లాభాలు సాధించవచ్చునని సినీ హీరో సుమన్ అన్నారు. బుధవారం నూతనంగా నిర్మించుకున్న హాసిని ఎస్టేట్స్ సొంత భవనాన్ని ఆయన ప్రారంభించారు. బ్రోచర్, క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. అనంతరం మార్కెటింగ్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎనిమిది సంవత్సరాలుగా మార్కెటింగ్ రంగంలో హాసిని ఎస్టేట్ తనదైన శైలిలో ముందుకు వెళుతూ కష్టమర్లకు ఎన్నో ప్రయోజనాలు కల్పిస్తుందని తెలిపారు. విజయవాడ జాతీయ రహదారి పైన నార్కట్ పల్లి వివేరా హోటల్ వెనకాల, అదే మార్గంలో కామినేని హాస్పిటల్ దాటిన తర్వాత రెండు కిలోమీటర్ల దూరంలో ఫార్మ్ ల్యాండ్ ఏర్పాటుచేసి అన్ని రకాల డెవలప్మెంట్ చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా మరిపెడ బంగ్లా లో 65 ఎకరాలలో వెంచర్ చేసి కస్టమర్లకు అందుబాటు ధరలో ప్లాట్లను ఉంచి విక్రయిస్తుందని పేర్కొన్నారు. పెట్టుబడులు పెట్టాలనుకునే కస్టమర్లు హాసిని ఎస్టేట్ ను నమ్ముకుని పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఎండి రవి కుంచారపు, అడ్మిన్ అరుణ్, చంద్రశేఖర్, మార్కెటింగ్ హెడ్ సర్దార్ నాయక్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



# రానున్న వర్షా కాలన్ని దృష్టిలో పెట్టుకొని నాలప్రక్షాళన

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

**కూకట్ పల్లి, విశాలభారతి :** రాబోయే వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని నాలప్రక్షాళన వేగవంతం చేయాలని జిహెచ్ఎంసి అధికారులకు బుదవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూకట్ పల్లి రంగదాముని చెరువు నుండి ప్రవహించే వర్షపు నీరు, డ్రైనేజీ నీరు స్వాన్ లేక్ మీదుగా కూకట్ పల్లి నాలాలో కలిసే మార్గంలో నాలా సరిగా లేకపోవడం వలన భారీ వర్షాలు కురిసిన సమయంలో గత రెండు సంవత్సరాలుగా స్వాన్ లేక్ అపార్ట్మెంట్లోలోకి వర్షంనీరు చేరి దాదాపు 200 కార్ల వరకు మునిగి పోయాయని అదేవిధంగా ఈ నాల నుండి వచ్చే వర్షపునీరు వలన కూకట్ పల్లి బస్ డిపో వద్ద నీరు నిలిచిపోవడంతో బస్సుల రాకపోకలకు ఇబ్బందులు కలిగే విషయం గత రెండు సంవత్సరాలుగా చూస్తూనే ఉన్నామన్నారు. రంగదాముని చెరువు నుండి డిపో వరకు ఇరిగేషన్ అధికారులు, ఎమ్మార్వో , జిహెచ్ఎంసి అధికారులు సమన్వయం చేసుకొని మార్కింగ్ ఏర్పాటు చేసి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి రాబోయే వర్షాకాలంలో నాలా పనులను పూర్తిచేయాలని అధికారులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎం ఆర్ ఓ స్వామి, టౌన్ ప్లానింగ్ సిపి ఉమాదేవి, ఏసిపి మల్లీశ్వర్, ఇరిగేషన్ ఈఈ నారాయణ ,మాజీ కార్పొరేటర్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.





# విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

**కూకట్ పల్లి, విశాలభారతి:** ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. బుధవారం కూకట్ పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఓల్డ్ బోయిన్ పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ తో కలిసి డివిజన్ పరిధిలోని లక్ష్మినర్సింహ కాలనీ, మైత్రీ వన్ కాలనీలను వారు పరిశీలించారు. ఇందులో భాగంగా ప్రధానంగా ప్రజల నుండి వచ్చిన సమస్యలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్ళగా వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పర్యటనలో తెలిపారు. పర్యటలో ప్రధానంగా విద్యుత్ పోల్ రోడ్డుపై ఉందని, అలాగే అధిక లోడ్ పడటంతో ట్రాన్స్ ఫార్మర్ పవర్ లోడును తట్టుకోలేక, విద్యుత్ సరఫరాకు నిరంతరం అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు ఎమ్మెల్యే కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సత్వరం సమస్యను పరిష్కారించాలని సూచించారు.. దీనికి స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు తక్షణం చర్యలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# విషం తాగి విద్యార్థి ఆత్మహత్య

**ఆర్థిక సహాయం అందజేసిన ఆచార్యులు**



**సికింద్రాబాద్,విశాలభారతి:** ఓయూ కామర్స్ కళాశాల కామర్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి నవీన్ సోమవారం రాత్రి ఆత్మహత్య యత్నం చేసుకున్నారు. జగిత్యాల జిల్లా కోరుట్ల కు చెందిన ఎర్ర నవీన్ 23 తండ్రి శ్రీనివాస్ ఓయులోని మంజిర వసథిగృహంలోని తను ఉండే రూమ్ నెంబర్ 14 లో కలుపు మందుతాగి ఆత్మహత్య యత్నంకు పాల్పడ్డాడు. ఆనంతరం సహా విద్యార్థులు నవీన్ ను గాంధీ ఆస్పత్రికి తరలించారు. బుధవారం ఉదయం 10 గంటలకు చికిత్స పొందుతూ మరణించారు. కామర్స్ ప్రిన్సిపాల్ ప్రో.శ్రీరాములు, హెడ్ ప్రో.చిన్నప్ప, చీఫ్ వార్డెన్ డా.శ్రీనివాస్ గాంధీ ఆస్పత్రి లో విద్యార్థి మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం వారు అంత్యక్రియల నిమిత్తం నవీన్ కుటుంబసభ్యులకు 30 వేల ఆర్థిక సహాయం అందజేశారు. సహా విద్యార్థులు నవీన్ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు.

# ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**భద్రాద్రి జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా**



**భద్రాద్రి కొత్తగూడెం, విశాలభారతి:** ఫిబ్రవరి 1వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులతోపాటు తోపాటు ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. ఫిబ్రవరి ఒకటవ తేదీ నుండి 15వ తేదీ వరకు జరగనున్న ప్రాక్టికల్ పరీక్షలు ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు అలాగే మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో 61 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల తీరు పర్యవేక్షణకు ముగ్గురు సభ్యులతో జిల్లా పరీక్షల కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 2433, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5893 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1935 మంది విద్యార్థులు, పరీక్షలకు హాజరవుతున్నట్లు అన్నారు . ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఆంగ్ల పరీక్ష ఫిబ్రవరి 16వ తేదీన ప్రాక్టికల్ పరీక్ష ఉంటుందని చెప్పారు. విద్యార్థులు చదివే కళాశాలల్లోనే ఆంగ్ల పరీక్ష ఉంటుందని విద్యార్థులతో ఆంగ్లం మాట్లాడించడం, చదివించడం, రాయించడం వంటివి ఉంటాయని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ పరీక్ష ఫిబ్రవరి 19వ తేదీన ఉంటుందని ఈ పరీక్ష ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామని చెప్పారు. రవాణాకు ఇటువంటి ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిసరాలు పరిశుభ్రంగా చేర్పించాలని పంచాయతీ, మున్సిపల్ అధికారులకు సూచించారు.

# ధనలక్ష్మికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్సీ



**చిట్యాల, విశాలభారతి:** పట్టణానికి చెందిన పిల్లలమర్రి ధనలక్ష్మి (60) అకాల మరణం పట్ల సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ శాసన మండలి సభ్యులు చెరుపల్లి సీతారాములు తీవ్ర సంతాపం తెలిపారు. ధనలక్ష్మి మృతదేహం పై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారం రోజుల పాటు దంపతులు ఇరువురు తీర్థ యాత్రలకు వెళ్ళి, నల్లగొండ లో బుధవారం తెల్లవారు జామున రైలు దిగే సందర్భంగా ప్రమాదవశాత్తు కిందపడి మరణించడం బాధాకరమని అన్నారు.వారి కుటుంబానికి, తమకు విడదీయరాని బంధం ఉందని అన్నారు. ధనలక్ష్మి కుటుంబ సభ్యులను ఓదార్చి,తమ ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, పార్టీ నాయకులు శీలా రాజయ్య,నారబోయిన శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్




# డివిజన్‌లోని సమ్యల పరిష్కారానికి కృషి

**కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్**

**కూకట్ పల్లి, విశాలభారతి:** కూకట్ పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని ఐ డి పి ఎల్ ఇందిరానగర్ బస్తి కమ్యూనిటీ హాల్లో స్థానిక సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు బుదవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ హాజరై, బస్తీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారదిశగా, సంబంధిత అధికారులకు సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గొట్టి ముక్కల వెంకటేశ్వరరావు, ఏ బ్లాక్ అధ్యక్షులు పి నాగిరెడ్డి, తెలంగాణ స్టేట్ మహిళా అధ్యక్షులు పుష్ప రెడ్డి, మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి, మోహన్ రెడ్డి, లక్ష్మయ్య, డివిజన్ అధ్యక్షులు మధు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్నకుమార్, ఎడ్ల మోహన్ రెడ్డి, ఆకుల నరేందర్, మేకల రమేష్, కుక్కల రమేష్, మాధురి రాము, మహేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.



# మీ కష్టాల్లో అండగా ఉంటా

**కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్**

**విశాలభారతి,కూకట్ పల్లి:** కూకట్పల్లి నియోజకవర్గ బేగంపేట్ డివిజన్ శ్యామ్ లాల్ బిల్డింగ్ ప్రాంతంలోని తాతాచారి కాలనీ వాస్తవ్యులు స్వర్గీయ ఏ యాదయ్య యాదవ్ గత కొద్ది రోజుల క్రితం దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించారు. వారు గతంలో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం ఇన్సూరెన్స్ పొందడం వలన వారికి కాంగ్రెస్ పార్టీ తరపున రెండు లక్షల రూపాయల బీమా పథకం చెక్కును వారి నివాసానికి వెళ్లి వారి యొక్క కుటుంబ సభ్యులను పరామర్శించి వారి సతీమణి విమలకు అందజేసిన కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అందజేశారు,ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టి ముక్కల వెంకటేశ్వరరావు, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, తెలంగాణ స్టేట్ మహిళా అధ్యక్షురాలు పుష్ప రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు హోసి తోచర్, బేగంపేట్ రమేష్, జైపాల్, నర్సింగ్ రావు, దయానంద్, భరత్ కుమార్, సురేష్, రమాదేవి తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఎస్సై శివకుమార్ కక్ష సాధింపులపై విచారణ జరిపించండి

- **మేడిపల్లి పోలీస్ స్టేషన్ ముందు కానిస్టేబుల్ నాగమణి ఆందోళన**
- **తన భర్తను రిమాండ్ కు తరలించే ప్రయత్నం**



**మేడిపల్లి,విశాలభారతి:** తన భర్త వరుణ్ పై ల్యాండ్ తగాదా విషయంలో తప్పుడు ఎంఎల్సి సర్టిఫికేట్ సృష్టించి రిమాండ్ కు తరలించే ప్రయత్నం మేడిపల్లి ఎస్సై శివకుమార్ చేస్తున్నారని కానిస్టేబుల్ నాగమణి పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గతంలో ఎస్సై శివకుమార్ అవినీతి, తీసుకున్నలంచాలపై సిపికి, DCP కి కంప్లైంట్ చేయడంతో తమపై కక్ష్య సాధింపు చర్యలు పాల్పడుతున్నాడని ఆరోపించారు. శివకుమార్ అవినీతికి సంబంధించి తన వద్ద వీడియో ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. పోలీస్ డిపార్ట్మెంట్ లో ఉన్న తనకే న్యాయం జరగకపోతే సామాన్య ప్రజలకు ఎలా న్యాయం చేస్తారని నాగమణి అవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారాలు స్పందించి సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.




# ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**పిడిఎస్యూ భీమ్‌గల్ మండల కన్వీనర్ నరసింహ**

**బాల్కొండ, విశాల భారతి:** ఢిల్లీలో ఈ నెల 3న అఖిల భారత నిరసన ర్యాలీ విజయవంతం చేయాలని పిడిఎస్యూ భీమ్‌గల్ మండల కన్వీనర్ నరసింహ అన్నారు. ప్రగతి నిరోధకంగ ఉన్న నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్యూ ఆధ్వర్యంలో భీమ్‌గల్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంధ్బంగా పిడిఎస్యూ మండల కన్వీనర్ ఎం.నరసింహ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం విద్యారంగంపై నయా మనువాద, నయా ఉదారవాద దాడులను అమలు చేస్తుందన్నారు. 2020లో తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం ప్రగతి నిరోదకంగ ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని రాష్ట్రాలతో చర్చించకుండా, పార్లమెంట్ ఫెడరల్ విధానాలను తుంగలో తొక్కి,దేశ ప్రజలపై అన్యాయంగా రుద్దుతుందన్నారు. ప్రొఫెసర్ ఆఫ్ మౌలానా ఆజాద్ జాతీయ ఫెలోషిప్, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వచ్చే స్కాలర్షిప్ లను ఫెలోషిప్ లను తగ్గించడం, తీసివేయడం జరుగుతుందన్నారు. ఈ పెను ప్రమాద నూతన జాతీయ విద్యా విధానం పాసిస్టు దాడులకు అడ్డుకట్ట వేయడానికి ఫిబ్రవరి 3న ఢిల్లీలో అఖిల భారత నిరసన ర్యాలీ జరగబోతున్నదని ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు,ప్రజలు,ప్రజాస్వామిక వాదులు, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యూ నాయకులు హరీష్,అన్వేష్,సాయి చరణ్, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి



**కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి**

**కూకట్ పల్లి, విశాలభారతి:** కూకట్ పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి పిలుపునిచ్చారు. బుదవారం కాంగ్రెస్ పార్టీ యువనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా చేపట్టిన భారత్ జూడో న్యాయ్ యాత్రకు సంబంధించిన వాహనాల స్టిక్కర్ను శేరి సతీష్ రెడ్డి ఆవిష్కరించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి రాహుల్ గాంధీ చేపడుతున్న యాత్రను అన్ని వర్గాల ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. కూకట్ పల్లి లో కూడా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంజీవరావు, అరవింద్ రెడ్డి, కొమ్ము బాబు, సతీశ్, రావుఫ్, రాజ్ కుమార్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ అభివృద్ధికి సర్పంచుల కృషి అభినందనీయం

**వీడ్కోలు పలికిన మండల పరిషత్ కార్యవర్గం**

**కొందుర్గు, విశాలభారతి:** కొందుర్గు మండల పరిధిలోని గ్రామపంచాయితీ సర్పంచుల,ఉప సర్పంచుల, వార్డు సభ్యుల ఐదేళ్ల పదవీకాలం బుధవారంతో ముగియనుండటంతో మండల ప్రజా పరిషత్ పరిషత్ కార్యవర్గం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గ్రామాల అభివృద్ధికి చేసిన కృషి అభినందనీయమని ముఖ్యంగా కరోనా గడ్డుకాలంలో గ్రామంలో అత్యున్నతమైన సేవలనుఅందించారని గుర్తు చేశారు.భవిష్యత్తులో జరిగేటటువంటి ఎన్నికలలో కూడా తిరిగి విజయం సాధించి అత్యున్నత పదవులకుఎదగాలనిఅధికారులు ప్రజా ప్రతినిదులు వారిని అభినందించి శాలువాలతోసన్మానించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిడిఓఆంజనేయులు,ఎంపీపీ పోతురాజు జంగయ్య, వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ ,మల్లేష్ గౌడ్,ఎంపీటీసీలు,అధికారులు వివిధ గ్రామాల సర్పంచ్ లు వార్డు సభ్యులు తదితరులుపాల్గొన్నారు.కొందుర్గులో.. గ్రామపంచాయితీ పాలక వర్గ సభ్యులను స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామయ్య గౌడ్ శాలువా పూలమాలలతో సన్మానించారు.



పీర్జాదిగుడా మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ కార్పొరేటర్ గా ఎన్నికై 5వ వసంతంలోకి అడుగిడుతున్న శుభసందర్భంగా కార్పొరేటర్ శ్రీ దొంతిరి హరిశంకర్ రెడ్డిని విహారిక కాలనీ,శ్రీ సాయి నగర్ కాలనీ,మహిళలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# గ్రామ పంచాయతీ ప్రజలకు ధన్యవాదాలు

**ఉప సర్పంచ్ జయలత బాల్ రెడ్డి**



**చేవెళ్ల, విశాల భారతి:** చేవెళ్ల మండల పరిధిలోని తంగడపల్లి మడికట్టు గ్రామపంచాయతీ గ్రామ ప్రజలకు ఉప సర్పంచ్, జయలతా బాల్ రెడ్డి ఐదేళ్ల కాలపరిమితి ముగియడంతో గ్రామపంచాయతీ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు సేవ చేసే అదృష్టం తనకు దక్కినందుకు ప్రజలు తన పై నమ్మకం ఉంచి ఉప సర్పంచ్ పదవి ఐదు సంవత్సరాలు సేవ చేసే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



# క్రైస్తవులపై దాడులను నిరసిస్తూ వినతి పత్రం అందజేత

**మంచిర్యాల, విశాల భారతి:** దండేపల్లి మండలంలోని క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఉద్దేశపూర్వకముగా కక్ష సాధింపు కోసం దాడులు చేస్తున్నారని, క్రైస్తవులు నిరసిస్తూ దండేపల్లి ఎమ్మార్వోకి వినతి పత్రం అందజేశారు. ఈ వినతి పత్రంలో వారు తెలుపుతూ ఉద్దేశపూర్వకముగానే క్రైస్తవులపై అక్రమ దాడులు చేస్తున్నారని, వారు చేసిన దాడులను సానుభూతికరముగా చిత్రీకరిస్తూ మత విద్వేషాలను రేకెత్తిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దండేపల్లి మండలం పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నతానియల్, వైస్ ప్రెసిడెంట్ ఏ పీ రాజు, సేవకులు పాల్గొన్నారు.

# మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించిన వ్యక్తి రిమాండ్



**భీమదేవరపల్లి, విశాల భారతి:** మండలంలోని పీవీ స్వగ్రామంలో మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించిన రౌడీషీటర్ ను వంగర పోలీసులు రిమాండ్ కు తరలించారు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో కూరగాయల సంతలో అమ్ముకునే మహిళ పట్ల వంగర పివి నగర్ చెందిన మంచాల సదానందం విచక్షణ రహితంగా బూతులు తిట్టి అసభ్యకరంగా ప్రవర్తించడంతో మహిళా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. మహిళల పట్ల ఎవరైనా దురుసుగా ప్రవర్తించినట్లయితే వారిపై పిడి యాక్ట్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.



# అక్రమంగా తరలిస్తున్న ఇసుక పట్టివేత

**బాల్కొండ, విశాల భారతి:** అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ని పోలీసులు పట్టుకున్నారు. బుధవారం ట్రాక్టర్ లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా భీమ్‌గల్ మండలం బాబాపూర్ గ్రామంలో పట్టుకున్నట్లు భీమ్‌గల్ ఎస్సై హరిబాబు తెలిపారు. పట్టుకున వాహనాన్ని ఎస్సై మైన్స్ అధికారులకు అప్పగించారు. ఈ వాహనం తలకుంటకి చెందిన గణేష్ అనే వ్యక్తిది అని గుర్తించారు. ఇక ముందు ఎవరు కూడా అక్రమ ఇసుకను తరలించవద్దని, ఒకవేళ తరలిస్తే వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# నిద్ర మాత్రలు మింగి వ్యకి ఆత్మహత్య



**భీమదేవరపల్లి, విశాల భారతి:** మండలంలోని కొత్తకొండ గ్రామానికి చెందిన రాచకొండ రాజు నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్న ఘటన హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో చోటుచేసుకుంది. ముల్కనూర్ ఎస్సై సాయిబాబు తెలిపిన వివరాల మేరకు మృతుడు గత కొంతకాలంగా మానసికంగా అనారోగ్య కారణాలతో బాధపడుతున్నాడని ఆరోగ్య విషయంలో మనస్థాపానికి గురై ఈనెల 25న ఇంట్లో ఎవరు లేని సమయంలో నిద్ర మాత్రలను మింగి ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. మృతునికి భార్య కుమారుడు కూతురు ఉంది. మృతుని భార్య సబిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు.




# సమాజాభివృద్ధి విద్యతోనే సాధ్యమవుతుంది

**ఐఎస్ఓ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్, రిటైర్డ్ అడిషనల్ కమిషనర్ టిఎన్ వెంకటస్వామి.**

**సికింద్రాబాద్, విశాలభారతి:** సమాజాభివృద్ధి ఒక విద్యతోనే సాధ్యమవుతుందని విద్యను పదిమందికి పంచినప్పుడే దానికి స్వార్థకత ఉంటుందని ఐఎస్ఓ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ రిటైర్డ్ అడిషనల్ కమిషనర్ టీఎన్ వెంకటస్వామి అన్నారు. నేడు ప్రపంచం లోనే భారతదేశంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు వచ్చిందని తెలిపారు. పేరు ప్రఖ్యాతలు హోదా విద్య వల్లనే వస్తాయని పేర్కొన్నారు. సమాజంలో విద్య చాలా అవసరమని, పిల్లలకు ఆస్తులు ఇవ్వలేకపోయినా విద్యను మాత్రం అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఐఎస్ఓ ఇన్స్టిట్యూషన్స్ డిగ్రీ కళాశాల యాన్యువల్ డే వేడుకలను తార్నాకలోని మర్రి చెన్నారెడ్డి ఫంక్షన్ హాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు మెడల్స్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. నేటి పరిస్థితుల్లో సబ్జెక్టు వైస్ గా అనేక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉందని విద్యార్థులు ఆ పరిజ్ఞానాన్ని అందుపుచ్చుకోవాలన్నారు. విద్యార్థులు చదువులో కాదు ఆటపాటల్లో కూడా తక్కువ కాదని వారి వారి నైపుణ్యతను బయటకు తీసి చేసి చూపించారు. సంస్కృతిక కార్యక్రమాలతో పాటు విద్యార్థులు చేసిన స్క్రిప్టు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ రమాదేవి, డీన్ మనోహర్, ప్రిన్సిపల్స్ రాజశ్రీ, ప్రదీప, దివ్య తోపాటు అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



# శేష జీవితం ఆనందమయం కావాలి

**మందమర్రి టౌన్, విశాల భారతి:** సింగరేణి ఉద్యోగి పదవి విరమణ అనంతరం శేష జీవితం ఆనందమయంతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఏరియా స్టోర్స్ ఎస్ఇ పైడిశ్వర్ ఆకాంక్షించారు. ఏరియా స్టోర్స్ లో సర్ఫేస్ జనరల్ మజ్దూర్ గా విధులు నిర్వహించి బుధవారం పదవి విరమణ పొందుతున్న జక్కుల శ్రీనివాస్ అతని సతీమణి స్వరూప దంపతులను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి ప్రశంస పత్రం, బహుమతులు, జ్ఞాపికను అందజేశారు. అనంతరం పైడిశ్వర్ మాట్లాడుతూ శ్రీనివాస్ క్రమశిక్షణ గల కార్మికుడని, క్రమశిక్షణతో తన విధులు నిర్వహించి, పూర్తి ఆరోగ్యంతో పదవీ విరమణ పొందడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం ఏరియా స్టోర్స్ సిబ్బంది, ఏఐటీయూసి, ఐఎన్టీయూసీ, నాయకులు శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, ఆయన సహచర ఉద్యోగులు, మిత్రులు, కాంట్రాక్ట్ కార్మికులు శ్రీనివాస్, స్వరూప దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా స్టోర్స్ సిబ్బంది శశిధర్, వెంకటేశ్వర్లు, పరుశురాం, గోలి సత్యనారాయణ,డి నాగేష్,ఎస్కే బాబా, జే శశిధర్, కాసర్ల సత్యనారాయణ, ఎస్ రంజిత్, ఏఐటియుసి నాయకులు కే ఓదేలు, శ్రీనివాస్, నాగమణి, అరుణ, ఐఎన్టియుసి నాయకులు డి కిషోర్,ఏ సమ్మయ్య, సుగుణాకర్, శ్రావణ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సైంధవ్ గ్లోబల్ స్ట్రీమింగ్ ప్రకటించిన ప్రైమ్ వీడియో



శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయినపల్లి నిర్మాతగా నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిర్మించిన సైంధవ్ చిత్రంలో వెంకటేష్ దగ్గుబాటి, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, ఆండ్రియా జెర్మియా ప్రధాన పాత్రల్లో నటించారు. భారతదేశం సహ ప్రపంచవ్యాప్తంగా 240 దేశాలు, ప్రాదేశిక ప్రాంతాల్లోని ప్రైమ్ సభ్యులు ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రాన్నితెలుగు సహ తమిళ్, ఫిబ్రవరి 3 నుంచి చూడవచ్చు . ముంబయి, ఇండియా—— జనవరి 31, 2024 —— భారతదేశం అమితంగా ఇష్టపడే వినోదకేంద్రం ప్రైమ్ వీడియో తెలుగు యాక్షన్ థ్రిల్లర్ సైంధవ్ స్ట్రీమింగ్‌ను నేడు ప్రకటించింది. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయినపల్లి నిర్మాతగా నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై వెంకటేష్ దగ్గుబాటి హీరోగా నటించిన ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, ఆండ్రియా జెర్మియా ప్రధాన పాత్రల్లో నటించారు. భారతదేశం సహ ప్రపంచవ్యాప్తంగా 240 దేశాలు, ప్రాదేశిక ప్రాంతాల్లో ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రాన్నితెలుగుతో పాటు తమిళ్, ఫిబ్రవరి 3 నుంచి చూడవచ్చు. ప్రైమ్ మెంబర్‌షిప్‌లో సైంధవ్ సరికొత్త చేరిక. సంవత్సరానికి కేవలం ₹1499 మెంబర్‌షిప్‌తో భారతదేశంలోని ప్రైమ్ సభ్యులు పొదుపు, సౌకర్యం, వినోదం అన్ని పొందవచ్చు. కాలానికి వ్యతిరేకంగా పోరాడుతున్న సైకో మరి ముంచుకొస్తున్న ముప్పు నుంచి తన కుమార్తె రక్షించుకోవడంలో విజయం సాధిస్తాడా? తెలుసుకోవాలంటే అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఫిబ్రవరి 3 నుంచి స్ట్రీమ్ అయ్యే సైంధవ చూడాల్సిందే.

## సమంత ఆ సిరీస్ నుంచి ఔట్!

'ఖుషీ' తర్వాత సమంత అమెరికా లో రిలాక్స్ అవుతోన్న సంగతి తెలిసిందే. అన్నిరకాల టెన్షన్ ల నుంచి రిలీఫ్ కావాలని అమ్మడు కొన్ని నెలలుగా అక్కడే ఉంటుంది. అయినా ఇక్కడ యాక్టివిటీస్ వేటిని ఆపలేదు. తన టీమ్ ద్వారా అన్ని రకాల సమాచారం అందుకుంటూ వాటిని యధావిధిగా కొనసాగిస్తుంది. ఈనేపథ్యంలో తాజాగా సమంత బాలీవుడ్ వెబ్ సిరీస్ 'సీటాడెల్' డబ్బింగ్ పనులు కూడా పూర్తి చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఆ సిరీస్ నుంచి షూట్...డబ్బింగ్ పనులు ముగించి బయటకు వచ్చేసింది. దీంతో ఇప్పట్లో సమంత అవసరం సీటాడెల్ కి లేదని తెలుస్తోంది. ఇంతవరకూ ఈ సిరీస్ రిలీజ్ ఎప్పుడు? అన్నది ప్రకటించలేదు. మళ్లీ రిలీజ్ తేదీ ప్రకటిస్తే తప్ప మంత ఆ వెబ్ సిరీస్ పనుల్లో భాగం కాదు. మళ్లీ ప్రచారం కోసమే టీంతో కలిసి పనిచేయనుందని తెలుస్తోంది. ఇది హాలీవుడ్ లో ప్రియాంక చోప్రా నటించిన వెబ్ సిరీస్ అన్న సంగతి తెలిసిందే. ఇండియన్ వెర్షన్ లో రాజ్ అండ్ డీకే తెరకెక్కించగా ఆ ఛాన్స్ సమంతకి వచ్చింది. అయితే హాలీవుడ్ లో ఈ సిరీస్ డిజాస్టర్ గా మిగిలింది. వేల కోట్లు భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మించారు. కానీ ఈసిరీస్ ఆడియన్స్ ని మెప్పించలేకపోయింది. దీంతో నిర్మాతలకు భారీగా నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో రాజ్ అండ్ డీకే సీటాడెల్ లో కొన్ని మార్పులు చేస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడ వైఫల్యాన్ని దృష్టిలో పెట్టుకుని.. భారతీయులకు అర్ధమయ్యే రీతిలో మార్పులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే సిరీస్ రిలీజ్ డేట్ కూడా ప్రకటించలేదు. అయితే ఈ ఏడాది రిలీజ్ అవ్వడం ఖాయమే. మరి రిలీజ్ తేది ఎప్పుడు వస్తుంది? అన్నది చూడాలి. ప్రస్తుతం సమంత కూడా బాలీవుడ్ కెరీర్ పై దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే.





## భామాకలాపం 2 టీజర్ విడుదల

ప్రియమణి నటించిన భామా కలాపం 2 నుంచి ఇటీవలే విడుదలైన ఫస్ట్‌లుక్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఈరోజు 'భామాకలాపం 2' టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్‌లో అనుపమ పాత్రలో ప్రియమణి అమాయకపు గృహిణిగా కనిపించారు. అనుపమ తన గత జీవితాన్ని, అపార్ట్‌మెంట్‌ను విడిచిపెట్టి, ఆమె భర్తకు ఇచ్చిన మాట ప్రకారం కొత్త జీవితాన్ని ప్రారంభిస్తుంది. 'అనుపమ అనే నేను, పక్కన వాళ్ళ విషయాలలో తలదూర్చను అని, నా పని నేను చేసుకుంటూ ప్రశాంతంగా ఉంటానని" మాట ఇస్తున్నాను అనే డైలాగ్ తో టీజర్ ప్రారంభం అయింది. అదే సమయంలో దారుణంగా హత్య చేయడం కనిపిస్తుంది. ఆ క్రైం నుంచి ఆమె ఎలా బయటపడింది అనేది ప్రధానాంశం. టీజర్‌లో వినోదంతో పాటు చాలా థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉన్నాయి. ఈ టీజర్ లో ప్రియమణి, శరణ్య ప్రదీప్ టైమింగ్ నవ్వులు పూయిస్తుంది. డైలాగ్, యాక్షన్ ఇలా అన్నీ ఆకట్టుకునేలా ఉన్నాయి. ఫిబ్రవరి 16న ఆహాలో స్ట్రీమింగ్ కానుంది.

## అంబాజీపేట మ్యారేజి బ్యాండు సినిమా బిగ్ టికెట్ రిలీజ్ చేసి టీంను అభినందించిన స్టార్ హీరో విజయ్ దేవరకొండ

సుహాస్ హీరోగా నటించిన సినిమా "అంబాజీపేట మ్యారేజి బ్యాండు". ఈ చిత్రాన్ని జీఏ2 పిక్చర్స్, దర్శకుడు వెంకటేష్ మహా బ్యానర్ మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మించాయి. "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" సినిమాకు దుశ్యంత్ కటికినేని దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఫిబ్రవరి 2న థియేటర్స్ ద్వారా గ్రాండ్ గా ప్రేక్షకుల ముందుకురానుంది. ఇవాళ హైదరాబాద్ లో "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" సినిమా బిగ్ టికెట్ ను హీరో విజయ్ దేవరకొండ రిలీజ్ చేశారు. ఈ సినిమాను చూసిన విజయ్ దేవరకొండ మూవీ చాలా బాగుందంటూ ప్రశంసించారు. ఇదొక స్పెషల్ ఫిల్మ్ అని, తప్పకుండా ఘన విజయం సాధిస్తుం ద ని




చెప్పారు.విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" బిగ్ టికెట్ లాంఛ్ చేయడం సంతోషంగా ఉంది. ఇలాంటి మంచి సినిమా ప్రమోషన్ లో భాగమవడం హ్యాపీగా ఉంది. ఈ సినిమా టీజర్ దగ్గర నుంచి ఒక ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తూ వచ్చింది. ఈ మూవీ టీమ్ లోని ప్రతి ఒక్కరూ నాకు దగ్గర వాళ్లు. ఈ ఫిబ్రవరి 2న థియేటర్స్ లోకి ఒక స్పెషల్ మూవీ రాబోతోంది. "అంబాజీపేట మ్యారేజి బ్యాండు"సినిమా చూశాను. ఫస్ట్ హాఫ్ అద్భుతంగా ఉంది. మ్యూజిక్, ఆర్టిస్టుల పర్ ఫార్మెన్స్ లు నెక్ట్ లెవెల్ లో ఉన్నాయి. సుహాస్ ఎప్పటిలాగా చాలా బాగా నటించాడు. శరణ్య అద్భుతంగా పర్ ఫార్మ్ చేసింది. ఏ సినిమాకైనా ఫస్ట్ హాఫ్ చూశాక కొంత విరామం తీసుకునే నేను ఈ సినిమాకు కంటిన్యూగా ఫుల్ మూవీ చూశాను. అంత క్యూరియస్ గా అనిపించింది. మీరు కూడా థియేటర్ లో ఇదే ఫీల్ అవుతారు. అని అన్నారు.



## "ది గోట్ లైఫ్" బిగినింగ్ లుక్ పోస్టర్

మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్న సినిమా "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం). హాలీవుడ్ యాక్టర్ జిమ్మీ జీన్ లూయిస్, అమలాపాల్, కేఆర్ గోకుల్, అరబ్ ఫేమస్ యాక్టర్స్ తాలిబ్ అల్ బలూషి, రిక్ ఆబే ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. బెన్యామిన్ రాసిన గోట్ డేస్ నవల ఆధారంగా ఈ సినిమాను అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ బ్లెస్సీ రూపొందించారు. విజువల్ రొమాన్స్ బ్యానర్ "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం) సినిమాను మలయాళ చిత్ర పరిశ్రమలో ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ గా భారీ బడ్జెట్ తో నిర్మించింది. ఏప్రిల్ 10న "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం) సినిమా పాన్ ఇండియా స్థాయిలో మలయాళంతో పాటు హిందీ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో రిలీజ్ కానుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి రెబల్ స్టార్ ప్రభాస్ రిలీజ్ చేసిన ఫస్ట్ పోస్టర్, రన్వీర్ సింగ్ రిలీజ్ చేసిన సెకండ్ పోస్టర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇవాళ "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం) సినిమా నుంచి ది బిగినింగ్ పోస్టర్ ను స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు. మూవీ టీమ్ కు దుల్కర్ సల్మాన్ తన బెస్ట్ విశెస్ అందించారు. గత రెండు పోస్టర్స్ చూస్తే ఈ బిగినింగ్ పోస్టర్ భిన్నంగా ఉంది. ఇందులో తన సుదీర్ఘ ప్రయాణానికి ముందు సంతోషంగా ఉన్న నజీబ్ పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపిస్తున్నారు.



## 'ధీర'ని ప్రేక్షకులు విజయవంతం చేయాలి



వలయం, గ్యాంగ్‌స్టర్ గంగరాజు వంటి హిట్ సినిమాల తరువాత 'ధీర' అనే సినిమాతో లక్ష్ చదలవాడ మరోసారి మాస్ ప్రేక్షకుల్ని మెప్పించేందుకు సిద్ధమయ్యారు. ఈ మూవీని చదలవాడ బ్రదర్స్ సమర్పణలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర బ్యానర్ మీద పద్మావతి చదలవాడ నిర్మించారు. విక్రాంత్ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన ఈ ప్రాజెక్ట్ మీద అందరిలోనూ అంచనాలు ఏర్పడ్డాయి. ఫిబ్రవరి 2న ఈ చిత్రం విడుదల కాబోతోంది. ఈ క్రమంలో మంగళవారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్ లో దిల్ రాజు, గోపీచంద్ మలినేని, త్రినాథరావు నక్కిన సినిమా బిగ్ టికెట్ ను లాంచ్ చేశారు. అనంతరం ఈవెంట్ లో దిల్ రాజు మాట్లాడుతూ.. '25 ఏళ్ల నుంచి చదలవాడ బ్రదర్స్‌ని చూస్తూనే ఉన్నాం. అనురాధ ప్రొడక్షన్స్‌లో ఎన్నో అద్భుతమైన చిత్రాలు నిర్మించారు. ఆ టైంలోనే నేను డిస్ట్రిబ్యూటర్‌గా కెరీర్ ప్రారంభించాను. వారితో నాకు పెద్దగా పరిచయం ఉండేది కాదు. దసరా సినిమాను వాళ్లు కొన్నారని తెలిసి వారిని కలవడం జరిగింది. ఆ తరువాత మేం వ్యక్తిగతంగా ఎంతో దగ్గరయ్యాం. శ్రీనివాస్ గారు ఎంతో మంది చిన్న నిర్మాతలకు సాయం చేశారు. ఫైనాన్షియల్‌గా ఎంతో సపోర్ట్ చేస్తారు. ఫిలిం చాంబర్ ఎలెక్షన్స్‌లోనూ నేను అధ్యక్షుడిగా ఉండాలని నా కోసం ఎంతో సాయం చేశారు. నాకు మిగిలిన ఈ టైంలో, ఆ పదవి నుంచి వెళ్లే లోపు రిజల్ట్‌ను చూపించే ప్రయత్నం చేస్తాను. లక్ష్ నటించిన ధీర ట్రైలర్ బాగుంది. ఈ సినిమా ఫిబ్రవరి 2న రాబోతోంది. లక్ష్ కష్టానికి, టీం పడిన కష్టానికి తగిన ప్రతిఫలం రావాలి. ప్రేక్షకులు ఈ సినిమాను విజయవంతం చేయాలి. టీం అందరికీ ఆల్ ది బెస్ట్' అని అన్నారు. డైరెక్టర్ విక్రాంత్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'దర్శకుడు రాసుకున్న కథ, కన్న కలలను నిర్మాత నెరవేరుస్తుంటారు. ఇంత పెద్ద బ్యానర్ నుంచి దర్శకుడిగా పరిచయం అవుతానని అనుకోలేదు. ఘోస్ట్‌గా రాసిన సినిమాలు హిట్టయ్యాయి. కానీ పేరు రాలేదు. ఆ తరువాత ధీర కథను రాసుకున్నాను. రాముడికి, కృష్ణుడికి కొన్ని లక్షణాలుంటాయి. రావణాసురుడికి కొన్ని లక్షణాలుంటాయి. ఈ చిత్రం 80 శాతం నైట్ ఎఫెక్ట్‌లో ఉంటుంది. ఫిబ్రవరి 2న రాబోతోన్న అన్ని చిత్రాలు హిట్ అవ్వాలి. సినిమా పరిశ్రమ బాగుంటేనే మేం అంతా బాగుంటామ'ని అన్నారు.

## తమన్నా ఫేట్ అతడి చేతిలో..!

చాలా మంది నటవారసులను తెరకు పరిచయం చేస్తూ వారి ఫేట్ ని డిసైడ్ చేస్తున్నాడు కరణ్ జోహార్. ఇప్పటివరకూ కరణ్ పరిచయం చేసిన డెబ్యూ నటీమణులు ఎవరూ ఫెయిల్ కాలేదు. కెరీర్ పరంగా అత్యున్నత స్థానంలో ఉన్న కనీసం పది పేర్లు సినీప్రియులు చెప్పగలరు. సీనియర్ కథానాయికల కెరీర్ లకు కూడా అతడు బిగ్ బూస్టర్ అని చెప్పాలి. ఇంతకుముందే లస్ట్ స్టోరీస్ 2 సిరీస్ లో తమన్నాకు ఆఫర్ ఇచ్చాడు కరణ్. ఆ సిరీస్ లో తమన్నా పెర్ఫామెన్సెస్, బెడ్ రూమ్ సన్నివేశాలు బ్లాస్ట్ అయ్యాయి. అది నిజానికి తమన్నాకు ఓటీటీ కెరీర్ లో గొప్ప మైలేజ్ ని ఇచ్చింది. ఆ తర్వాత మళ్లీ అదే తరహాలో ప్రయత్నించి తమన్నా కెరీర్ బండిని సజావుగా సాగిస్తోంది. ప్రస్తుతం షోల పరంగా క్షణం తీరిక లేకుండా బిజీ అయింది. ఇప్పుడు లస్ట్ స్టోరీస్ 2 కి భిన్నమైన కంటెంట్ తో తమన్నాకు కరణ్ అద్భుత అవకాశాన్ని అందిస్తున్నాడు. కరణ్ జోహార్ కొత్త OTT సిరీస్ కోసం తమన్నా భాటియాతో కలిసి తన డిజిటల్ కంటెంట్ వెంచర్‌లను విస్తరిస్తున్నాడు. స్టార్టప్ ప్రపంచంలో ప్రవేశించి సత్తా చాటాలనుకున్న ఇద్దరు మహిళల గురించి నాటకీయంగా సాగే కథతో ఒక వెబ్ సిరీస్ ని కరణ్ నిర్మిస్తున్నారు. ఈ సిరీస్ కి డా. అరోరాకి పేరుగాంచిన అర్చిత్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. మార్చి లేదా ఏప్రిల్‌లో చిత్రీకరణకు వెళుతుంది. ప్రస్తుతం రెండవ ప్రధాన పాత్రధారిని ఎంపిక చేయాల్సి ఉంది. కాఫీ విత్ కరణ్ తో కరణ్ అద్భుతంగా రాణిస్తున్నాడు. కరణ్ జోహార్ తన చాట్ షో 8వ సీజన్‌ను అందించాడు. అలాగే కరణ్ నిర్మిస్తున్న అనన్య పాండే తొలి OTT షో 'కాల్ మీ బే' చిత్రీకరణకు వెళ్లనుంది. ఇమ్రాన్ హష్మీ తో 'షోటైమ్'ని ప్లాన్ చేసాడు. ఇంతలోనే అతడు మిల్కీ వైట్ బ్యూటీ తమన్నా భాటియాతో ముందుకు సాగుతున్నాడు. తమన్నా భాటియా గత కొన్ని సంవత్సరాలుగా OTT లో అద్భుతంగా రాణిస్తోంది. ఇప్పటికే లస్ట్ స్టోరీస్ 2, జీ లే జరా, ఆఖ్రీ సచ్ వంటి ఓటీటీ ప్రాజెక్ట్‌లను చేసింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.